




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States








సంపుటి : 24 | సంచిక : 52 | ది.23-4-2025 | విజయవాడ | బుధవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


## ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణానికి, అభివృద్ధికి అండగా నిలవండి

- ఢిల్లీలో కేంద్రమంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులకు సాయం అందించాలని కోరిన సీఎం







**అమరావతి,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు ప్రాజెక్టులు, కేంద్ర పథకాలపై కేంద్ర మంత్రులతో మంగళవారం చర్చించారు. విదేశీ పర్యటన ముగించుకుని సోమవారం రాత్రి ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు.. .నలుగురు కేంద్ర మంత్రులతో భేటీ అయ్యి పలు అంశాలపై చర్చించారు. ముందుగా కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్ తో భేటీ అయిన చంద్రబాబు జల్ జీవన్ మిషన్ పథకానికి కేంద్ర నిధుల మంజూరుపై చర్చించారు. కేంద్ర పథకమైన జల్ జీవన్ మిషన్ ను రాష్ట్రంలో విస్తృత స్థాయిలో ఉపయోగించుకోవాలని భావిస్తున్న ముఖ్యమంత్రి....ఈ పథకానికి నిధుల విడుదలపై కేంద్ర మంత్రితో చర్చించారు. అదే విధంగా రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు ప్రతిపాదించిన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుపైనా కేంద్ర జలశక్తి మంత్రికి వివరించి...ఈ ప్రాజెక్టుకు సాయం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే కలిగే ప్రయోజనాలు ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి వివరించారు. అదే విధంగా కేంద్ర అటల్ భూజల్ యోజన్ కార్యక్రమంపై భేటీలో చర్చించారు. భూగర్భ జలాల వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించిన సిఎం...ఈ కార్యక్రమానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. కర్నూలులో హై కోర్టు బెంచ్ అంశంపై ఆయనతో చర్చించారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన కార్యాచరణ అమలు చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పీయూష్ గోయల్ తో భేటీ అయిన ముఖ్యమంత్రి చంద్రబాబు...అమెరికా సుంకాల కారణంగా రాష్ట్రంలో ఆక్వా రంగంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. భారతదేశ సీ ఫుడ్స్ పై విధించిన 26 శాతం సుంకాలు ఏపీలోని ఆక్వా రంగానికి తీవ్ర నష్టం చేస్తున్నాయని సిఎం వివరించారు. ఈ విషయంలో అమెరికాతో చర్చించి ఆక్వా రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. దీని కోసం తీసుకోవాల్సిన స్వల్ప కాలిక, మధ్యస్థ, దీర్ఘకాలిక చర్యల గురించి పలు ప్రతిపాదనలు సూచించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాలను అమిత్ షాకు సీఎం చంద్రబాబు వివరించి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ భేటీ లలో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీలు పాల్గొన్నారు.

## మీ లేఖను చారిత్రక నగరంలో చదివాను: రాహుల్ గాంధీ లేఖపై రేవంత్ రెడ్డి స్పందన

- 'రోహిత్ వేముల' చట్టం తీసుకురావాలని రాహుల్ గాంధీ లేఖ
- 'ఎక్స్' వేదికగా స్పందించిన రేవంత్ రెడ్డి
- రాహుల్ గాంధీ స్ఫూర్తిదాయకమైన పిలుపు తనను బలంగా తాకిందన్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** తెలంగాణలో విద్యార్థుల ఆత్మహత్యలను నివారించేందుకు, విద్యాసంస్థల్లో వివక్షను రూపుమాపేందుకు ప్రత్యేకంగా 'రోహిత్ వేముల చట్టం' తీసుకురావాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాసిన లేఖపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. ఈ మేరకు సోమవారం పార్టీ అగ్రనేత రాసిన లేఖను ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా పంచుకున్నారు. రాష్ట్రంలో యువతకు భద్రత కల్పించే దిశగా చట్టం అవసరమని రాహుల్ గాంధీ అభిప్రాయపడ్డారు. రోహిత్ వేముల, పాయల్ తాడ్వీ, దర్శన్ సోలంకి వంటి ఎందరో ఉజ్వల భవిష్యత్తు కలిగిన యువకులు అర్ధాంతరంగా తనువు చాలించడం దురదృష్టకరమని రాహుల్ గాంధీ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మొదలు రోహిత్ వేముల వరకు ఎంతో మంది ఎదుర్కొంటున్న వివక్షకు చరమగీతం పాడేలా, భవిష్యత్తులో మరెవరికీ ఇలాంటి అన్యాయం జరగకుండా ఈ కొత్త చట్టం దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుతం జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ లేఖను ఎక్స్ వేదికగా పంచుకుని, తాను చారిత్రక హిరోషిమా నగరంలో ఉన్నానని పేర్కొన్నారు.



మహాత్మా గాంధీ విగ్రహాన్ని సందర్శించే సమయంలో రాహుల్ గాంధీ లేఖను చదివానని తెలిపారు. రాహుల్ గాంధీ స్ఫూర్తిదాయకమైన పిలుపు తనను బలంగా తాకిందని, గర్వించదగిన భవిష్యత్తును రూపొందించడంలో ఆయన ఆలోచనలు, భావాల స్ఫూర్తితో ముందుకు వెళతామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. దళిత విద్యార్థులకు విద్యా సంస్థల్లో వివక్ష ఎదురవకుండా రోహిత్ వేముల చట్టాన్ని తీసుకురావాలని రాహుల్ గాంధీ ఇటీవల కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు, నిన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కులకు సూచించారు.

## గద్దర్ సినిమా అవార్డుల ఫంక్షన్ నభూతో న భవిష్యత్తు అన్నట్టు జరపాలి

- తెలంగాణ రాష్ట్రంలో గద్దర్ పుట్టడం మన అదృష్టం.. రాష్ట్ర ఆవిర్భావానికి పునాది వేశారు
- గత 10 ఏళ్ళు సినీ పరిశ్రమ నిరాదరణకు గురైంది
- కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే సినీ పరిశ్రమకు ప్రోత్సాహం
- గద్దర్ సినిమా అవార్డుల జ్యూరీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** గద్దర్ సినిమా అవార్డుల ఫంక్షన్ కార్యక్రమాన్ని నభూతో నా భవిష్యత్తు అన్నట్టుగా జరపాలి అందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు భరోసా ఇచ్చారు. మంగళవారం ఎల్.వి. ప్రసాద్ సినీ ల్యాబ్ లో నిర్వహించిన గద్దర్ అవార్డుల జ్యూరీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ స్థాయిలో సినిమా అవార్డుల ఫంక్షన్ ఏ విధంగా నిర్వహిస్తారో అందుకు ఏమాత్రం తగ్గకుండా గద్దర్ సినిమా అవార్డుల కార్యక్రమం నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాదులో నిర్వహించబోయే గద్దర్ చలనచిత్ర అవార్డుల ఫంక్షన్ గురించి ప్రపంచవ్యాప్తంగా మాట్లాడుకునేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని కమిటీ సభ్యులు, అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. గత పది సంవత్సరాలు రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ నిరాదరణకు గురైంది అన్నారు. 2011లో చలనచిత్ర అవార్డుల పంపిణీ కార్యక్రమం నిలిచిపోయి ప్రోత్సాహం కరువైంది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో



గద్దర్ పుట్టడం మన అదృష్టం, దశాబ్దానికి ఒకరు అలాంటి మహానుభావులు పుడతారు అని కీర్తించారు. తెలంగాణ సంస్కృతి, గుండె చప్పుడును విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుడు గద్దర్ అని తెలిపారు. తెలంగాణ సంస్కృతి భావజాలాన్ని రాష్ట్రానికి దేశానికి ప్రపంచానికి స్పష్టమైన మార్గంలో గద్దర్ ప్రచారం చేశారని వివరించారు. ఆయన బాణిని చిన్నపిల్లలు నుంచి ముసలి వాడి వరకు అనుకరించారని తెలిపారు. సింగరేణి ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర సాధన డిమాండ్తో గద్దర్ పాదయాత్ర చేసి ప్రత్యేక రాష్ట్రానికి నాంది పలికారని వివరించారు. ఎక్కడో ఉన్న చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్కు తరలించి ప్రోత్సహించింది అన్నారు. చిత్ర పరిశ్రమను తరలించి ప్రోత్సాహకాలు అందించడమే కాదు, సినీ పరిశ్రమ లో పనిచేసే వారికి ఇళ్ల స్థలాలను సైతం కేటాయించాం అన్నారు. సమాజంలో అభివృద్ధి, విలువలను ప్రోత్సహించేది మీడియానే, మీడియాను కాపాడుకునే బాధ్యత పాలకులపై ఉంది అన్నారు.

## ఇంటెలిజెన్స్ చీఫ్ నుంచి నిందితుడిగా...



**విజయవాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ఏపీలో మంగళవారం ఉదయం ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. సీనియర్ ఐపీఎస్ అధికారి, ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ వి. సీతారామాంజనేయులు (పీ ఎస్ ఆర్ ఆంజనేయులు) అరెస్టు అయ్యారు. ఏపీ పోలీసులు మంగళవారం ఉదయం హైదరాబాద్ బేగంపేట పరిధిలోని పీఎస్ఆర్ ఇంటిలోనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆ వెంటనే ఆయనను హైదరాబాద్ నుంచి విజయవాడ తరలించారు. మంగళవారం సాయంత్రానికి గానీ పీఎస్ఆర్ ను విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. ఏపీకి సంబంధించిన కేసుల్లో హైదరాబాద్ లో అరెస్టు అయిన నాలుగో వ్యక్తిగా పీఎస్ఆర్ నిలిచారని చెప్పాలి. ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, సినీ నటుడు పోసాని కృష్ణ మురళి, ప్రభుత్వ మాజీ సలహాదారు రాజ్ కసిరెడ్డిలు ఏపీకి చెందిన కేసుల్లో హైదరాబాద్ లో అరెస్టు అయిన సంగతి తెలిసిందే. ముంబైకి చెందిన సినీ నటి కాదంబరీ జెత్వానీపై వేధింపులకు సంబంధించిన కేసులో పీఎస్ఆర్ నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ కేసులోనే పీఎస్ఆర్ ఇప్పటికే సస్పెన్షన్ లో ఉన్నారు. తాజాగా ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేసే నిమిత్తం ఏపీ పోలీసులు పీఎస్ఆర్ ను ఏకంగా అరెస్టు చేసినట్లుగా సమాచారం. ఈ కేసులో పీఎస్ఆర్ తో పాటుగా మరో సీనియర్ ఐపీఎస్ కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలు కూడా నిందితులుగా ఉన్నారు. పీఎస్ఆర్ తో పాటు వారిద్దరూ గతంలోనే సస్పెన్షన్ కు గురయ్యారు. అయితే ఈ కేసులో వారిద్దరూ కోర్టులను ఆశ్రయించి ముందస్తు బెయిల్ తీసుకున్నారు. అయితే పీఎస్ఆర్ మాత్రం ముందస్తు బెయిల్ తీసుకోలేదు. ఈ కారణంగానే టాటా, గున్నీలను పక్కనపెట్టిన పోలీసులు పీఎస్ఆర్ ను అరెస్టు చేసినట్లుగా తెలుస్తోంది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా పీఎస్ఆర్ కు పేరుంది. ఈ కారణంగానే జగన్ సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫోకల్ పోస్టుల్లోకి వచ్చిన పీఎస్ఆర్.. అనతి కాలంలోనే ఇంటెలిజెన్స్ చీఫ్ గా ఛాన్స్ కొట్టేశారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇంటెలిజెన్స్ చీఫ్ హోదాలో పీఎస్ఆర్.. జగన్ తో పాటు వైసీపీ ప్రభుత్వ పెద్దలు చెప్పిన చాలా పనులను చక్కబెట్టారని, అందులో భాగంగానే వైసీపీ పెద్దలు చెప్పంగానే.. నిబంధనలను పక్కన పెట్టేసి ముంబై వెళ్లి మరీ జెత్వానీని విజయవాడ తీసుకువచ్చారని ఆయనపై ఆరోపణలున్నాయి. అంతేకాకుండా రోజుల తరబడి తమ కస్టడీలో ఉంచుకున్న జెత్వానీపై వేధింపులకు పాల్పడ్డారని, తాము చెప్పినట్లుగా నడుచుకోవాలనీ, స్టేట్ మెంట్ ఇవ్వాలని ఆమెపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చారన్న కూడా ముగ్గురు ఐపీఎస్ లపై ఆరోపణలున్నాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నేతృత్వంలోని కూటమి అధికారంలోకి రాగానే విజయవాడ వచ్చిన కాదంబరి తనకు జరిగిన అన్యాయాన్ని వెల్లడించారు. దీంతో ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. వైసీపీ మాజీ నేత కుక్కల విద్యాసాగర్ తో పాటు పీఎస్ఆర్, టాటా, గున్నీలపై కేసులు నమోదు చేశారు. అంతేకాకుండా అప్పటిదాకా కీలక పోస్టుల్లో కొనసాగిన ముగ్గురు ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆది నుంచి నా రూటే సెపరేటు అన్నట్లుగా సాగే పీఎస్ఆర్ ఈ కేసును అంత సీరియస్ గా తీసుకోలేదన్న వాదనలు ఉన్నాయి. ఈ కారణంగానే ఆయన ముందస్తు బెయిల్ కోసం గానీ, కేసు కొట్టివేయాలని గానీ కోర్టులను ఆశ్రయించలేదు. అయితే కేసు సీరియస్ నెస్ ను గుర్తించిన టాటా, గున్నీలు కోర్టుకెళ్లి ముందస్తు బెయిల్ తీసుకుని అరెస్టు నుంచి తప్పించుకోగా%రా% పీఎస్ఆర్ మాత్రం అరెస్టు అయ్యారన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

## దేవదాయ ధర్మదాయ శాఖ

## చేపల చెరువు టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

కృష్ణాజిల్లా, గుడివాడ, బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానమునకు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములలో గల చేపల చెరువు వెరశి య. 3-12 సెంట్లకు గాను ఉన్న స్థితిలో 3 సం॥లు చెరువులో చేపలు వేసి పెంచుకొను హక్కు నిమిత్తము జి.ఒ.ఎంస్ ఎం. 426, తేది: 9-11-2015 ప్రకారం ది. 25-4-2025 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు గుడివాడ పట్టణం, శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థాన ఆఫీసునందు శ్రీ దేవదాయ శాఖ గుడివాడ శ్రీయుత తనిఖీదారు మరియు భక్తుల సమక్షంలో టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించబడును. ఆసక్తి కలవారు ధరావత్తు సొమ్ము రూ. 10,000/- చెల్లించి పాటలో పాల్గొనవలెను.

**షెడ్యూల్ వివరాలు**

| వ. నెం. | చెరువు ఉన్న గ్రామము | రీ.సర్వే నెంబర్ | విస్తీర్ణం య. సెం. | ధరావత్తు మొత్తం |
|---|---|---|---|---|
| 1 | పాములపాడు | 201/1.2 | 3-12 | 10,000 |

**కొన్ని ముఖ్యమైన షరతులు :-**

1. ఈ బహిరంగవేలం పాట దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారిచే జరుపబడును.
2. దేవస్థానమునకు ఏ విధమైన బకాయిలు ఉన్నవారు గాని లేదా ఎటువంటి లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు.
3. పాటలో పాల్గొనువారు పాటకు ముందుగా తనకు గల స్థిరాస్తి దస్తావేజులు లేక పట్టాదారు పాస్‌పుస్తకం మరియు టైటిల్ డీడ్ హామీగా ఇచ్చి ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొను నిర్ణయం.
4. కాలపరిమితి : 2025-26 సం॥ నుండి 2027-28 సం॥ వరకు అనగా 3 సం॥లు మాత్రమే.
5. చేపల చెరువుకు చెల్లించవలసిన సర్కారు వారి పన్నులను మరియు అపరాధ రుసుములు అన్నియు హెచ్చుపాట దారుడే చెల్లించు నిర్ణయము.
6. ప్రభుత్వం వారిచే నిషేధించబడిన చేపలు పెంచరాదు. వ్యర్ధ పదార్థాలు క్రిమి సంహారక మందులు వాడి నీటి కలుషితం చేయరాదు.
7. మిగిలిన పాట షరతులు పాట కాలమందు చదివి వినిపించబడును.
8. జి.ఓ.నెం. 426 ప్రకారం పాట మొత్తంపై 2-3 సంవత్సరముల లీజు 10% అదనంగా చెల్లించు నిర్ణయం.

పాములపాడు
15-4-2025

ఇట్లు : సం॥ కె.వి. గోపాలరావు
కార్యనిర్వహణాధికారి

## పోలవరం నిర్వాసితులకు అంత్యోదయ కార్డులు అందజేసిన మంత్రి నాదెండ్ల

**పోలవరం,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు మెరుగైన జీవన పరిస్థితులు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం రెడ్డి గణపవరంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు అంత్యోదయ అన్న యోజన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి తమ భూములు త్యాగంచేసిన 35 వేల మంది నిర్వాసితుల త్యాగాలను తమ ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని, వారిని ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. నిర్వాసితులకు ఆహార భద్రతాకీ అంత్యోదయ అన్నా యోజన కార్డులు అందజేసి వారికి ప్రతినెలా 35 కేజీల బియ్యన్ని ఉచితంగా అందిస్తున్నామన్నారు. నిర్వాసితుల కుటుంబాలలోని యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, ఇందుకోసం ప్రత్యేక సర్వేని నిర్వహిస్తామన్నారు.

## ప్రకటన

గౌరవ 1వ అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ 1st క్లాసు మచిలీపట్టణం వారి కోర్ట్‌లో CC. No. 73/2015 Cr. No. 148/14 U/S 304(A) IPC of Chilakalapudi PS కేసులో ముద్దాయి అయిన బత్తుల నాగ జగన్నాథం, S/o. పుల్లయ్య (లేట్), A/45, కులం : నాయి బ్రాహ్మణ, పోనంగి కాలనీ, ఏలూరు, ఏలూరు జిల్లా అను వారిపై గౌరవ 1వ అదనపు జుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ 1st క్లాసు మేజిస్ట్రేట్, మచిలీపట్టణం కోర్ట్ వారు Sec. 82 and 83 Cr.P.C Proceedings జారీ చేసినందున ఈ ప్రకటనను చూసి తేది. 30-05-2025న ఉదయం 10-30 గంటలకు 1st ADM, Court, మచిలీపట్టణంకు హాజరు కావలసిందిగా కోరడమైనది. మరియు వారి యొక్క ఆచూకి తెలిసిన వారు చిలకలపూడి C.I. అబ్దుల్ నబీ గారికి 8332983789 తెలియపరచవలసిందిగా కోరడమైనది.

కోర్టు వాయిదా తేది : 30-05-2025 న ఉదయం 10-30 గంటలకు.

**ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్**
**చిలకలపూడి పి.ఎస్.**

## డిస్కంల బలోపేతం, సుస్థిరాభివృద్ధి దిశగా విద్యుత్ రంగం

### విద్యుత్ శాఖ మంత్రుల సమావేశంలో కీలక చర్చ






**విజయవాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో విజయవాడ నోవాటెల్ హొటల్లో విద్యుత్ రంగ సంస్కరణలపై వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యుత్ శాఖ మంత్రుల 4 వ సమావేశం మంగళవారం నాడు జరిగింది. ఈ సమావేశానికి కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి పాద యస్సో నాయిక్ అధ్యక్షత వహించారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి విద్యుత్ శాఖ మంత్రులు, సీనియర్ అధికారులు హాజరయ్యారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రంగాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. డిస్కంలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు, సుస్థిరాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యుత్ రంగంలో కీలక సంస్కరణల అమలుకు నాంది పలికినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి పాద యస్సో నాయిక్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థల ఆర్థిక స్థితి, యాజమాన్య, నిర్వహణ సమస్యలను అధిగమించడానికి సమన్వయంతో సంస్కరణలు చేపట్టడం ఆవశ్యకమని అన్నారు. దీని కోసం రెగ్యులేటరీ సంస్కరణలు, రుణ పునఃరూపకల్పన, పునరుత్పాదక విద్యుత్ ఇంటిగ్రేషన్, విద్యుత్ స్టోరేజి పరిష్కారాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి విద్యుత్ పంపిణీ వ్యవస్థల బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా టారిఫ్ ల సమీక్ష తోపాటు ఏపీటిఈఎల్ లాంటి సంస్థలను శక్తివంతం చేయడం, టారిఫ్ ఆర్డర్లు, నెట్ మీటరింగ్ విధానాలను సరళీకృతం చేయడం లాంటి చర్యలను చేపట్టడం ద్వారా డిస్కంలను నష్టాల బారి నుంచి గట్టెక్కించవచ్చని సూచించారు. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ విస్తరణకు రూపొందించాలని పేర్కొన్నారు. స్పష్టమైన మార్గదర్శకాలను రూపొందించాలని పేర్కొన్నారు. రాజస్థాన్ విద్యుత్ శాఖ మంత్రి హీరా లాల్ నగర్ మాట్లాడుతూ రాజస్థాన్ లో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా 2025-26 నాటికి 36,700 మెగావాట్ల రూఫ్ టాప్ సోలార్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. అలాగే 77 లక్షల మందికి పైగా వినియోగదారులకు నెలకు 150 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ అందించడానికి చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. మహారాష్ట్ర మంత్రి మేఘన సకోరే బోర్డికర్ మాట్లాడుతూ మహావితరణ సంస్థ ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడేందుకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించిందన్నారు. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేయడానికి మరియు స్థిరమైన పరిష్కారాలకు మద్దతు ఇవ్వడానికి మహారాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఉత్తరప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి అరవింద్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్ కు తగిన విద్యుత్ పంపిణి వ్యవస్థను నిర్మించాలంటే పెద్ద మొత్తంలో పెట్టుబడులు అవసరమని ఇందుకు తక్కువ వడ్డీరేట్లతో ఋణం అవసరమని పేర్కొన్నారు. అధిక ఉత్పత్తి ఖర్చును తగ్గించాలని, బొగ్గు కేటాయింపులను ఆచరణాత్మక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ మాట్లాడుతూ విద్యుత్ రంగానికి అవసరమైన ఆర్థిక స్థిరత్వం కోసం వ్యయాధారిత టారిఫ్ విధానం అనివార్యమని స్పష్టం చేశారు. అదే విధంగా ఆర్థిక భారం తగ్గించేందుకు డిస్కంలు చేసిన అప్పులపై వడ్డీ రేట్లు తగ్గించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీసీఎల్ (మధ్యప్రదేశ్) ఎండీ అవినాష్ లావానియా, ఏఐడీఏ (ఆల్ ఇండియా డిస్కమ్స్ అసోషియేషన్) మరియు మాజీ ఇంధన శాఖ కార్యదర్శి, భారత ప్రభుత్వం డీజీ అలోక్ కుమార్, కేంద్ర ఇంధన శాఖ సంచాలకులు ప్రణవ్ తయల్, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అలీ షా, ప్రైవేట్ కార్యదర్శి, మహేశ్ జివాడే, జేఎస్, మినిస్ట్రీ ఆఫ్ పవర్ శశాంక్ మిశ్రా, ఏపీ ట్రాన్స్ కో జేఎండీ కీర్తి చేకూరి, ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ ఏకేవీ భాస్కర్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇతర ప్రతినిధులు, తదితరలు పాల్గొన్నారు.

# శభాష్ పరిమళ...!

● సంగీత విభాగంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్న కట్టా పరిమళ
● పొన్నెకల్లు కు గిన్నిస్ వైభవం ● పరిమళ కు అభినందనలు వెల్లువ

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మహిళలకు కూడా చోటు దొరుకుతోంది.వివిధ రంగాల్లో అద్భుతమైన విజయాలు సాధించిన మహిళలు గిన్నిస్ బుక్‌లో తమ పేర్లను నమోదు చేసుకుంటు న్నారు. ఈ అరుదైన గౌరవం గుంటూరు జిల్లా మహిళకు లభించింది.గుంటూరు జిల్లా,తాడికొండ మండలం,పొన్నెకల్లు గ్రామానికి చెందిన కట్టా పరిమళ గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చోటు సంపాదించి పొన్నెకల్లు గ్రామానికి గిన్నిస్ వైభవం తెచ్చారు.అంకుటిత దీక్ష,పట్టుదల, ఆమెలో ఉన్న మొక్కవోని ఆత్మవిశ్వాసమే గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు లో ఆమె పేరు లిఖించగలిగింది. వివరాలలోకేలైతే.........




**తాడికొండ (పొన్నెకల్లు),ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పొన్నెకల్లు గ్రామ టీడీపీ కార్యదర్శి కట్టా నాగేశ్వరరావు కోడలు కట్టా పరిమళ సంగీత విభాగంలో గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించుకున్నారు.విజయవాడ లోని శాంతినగర్ కు చెందిన గోరంట్ల శ్రీనివాసరావు, ధనలక్ష్మి దంపతుల చిన్న కుమార్తె పరిమళ.ఈమె ఇన్ఫోసిస్ సాఫ్టువేర్ కంపెనీ లో సాఫ్టువేర్ ఇంజినీర్ గా పనిచేశారు.ఈమే భర్త కట్టా కోటేశ్వరరావు ఐడిబిఐ బ్యాంక్ లో (IDBI BANK) లో ఏ జి ఎం ( %ూా+వీ% ) గా పనిచేస్తున్నారు.పరిమళ కు చిన్న వయసు నుంచి సంగీతంపై ఆసక్తి ఎక్కువ.తమ కుటుంబ ప్రోత్సాహమే తనకు ఈ అవార్డు పొందడానికి దోహదపడిందని ఆమె అన్నారు. 2024 డిసెంబర్ 1న విజయవాడలో హాలేల్ మ్యూజిక్ స్కూల్ డైరెక్టర్ అగస్టీన్ దండింగి వారి ఆధ్వర్యంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కోసం నిర్వహించిన అంతర్జాతీయ ఈవెంట్లో కట్టా పరిమళ పాల్గొన్నారు.దాదాపు 18 దేశాల నుంచి 1000 మంది కి పైగా విద్యార్థులు ఈ ఈవెంట్లో పాల్గొనగా పరిమళ ఒక గంట లో కీబోర్డ్ వాయించి వీడియోల రూపంలో ఇన్ స్టాగ్రామ్ లో పోస్ట్ చేశారు.ఆ వీడియోలను గిన్నిస్ ప్రతినిధులు పరిశీలించి కట్టా పరిమళ ను గిన్నిస్ రికార్డుకు అర్హులుగా ఎంపిక చేసి సర్టిఫికెట్ మరియు మెడల్ ను అందించారు.పరిమళ కు ఈ అరుదైన గౌరవం లభించడం పట్ల పొన్నెకల్లు గ్రామస్తులు,కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పొన్నెకల్లుకు గిన్నిస్ వైభవం తీసుకు రావడం ఆనందంగా ఉందని అంటున్నారు.

**అవార్డు రావడం సంతోషంగా ఉంది:పరిమళ..** ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది.తమ కుటుంబం ప్రోత్సాహంతో తాను గిన్నిస్ బుక్ లో చోటు సంపాదించగలిగాను.

## టిడిపి వీరాభిమాని చిత్రపటానికి నివాళులర్పించిన తిరువూరు ఎమ్మెల్యే



**విస్సన్నపేట,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** స్థానిక మండలం కేంద్రంలోని పద్మశాలి స్ట్రీట్ దుర్గమ్మ వీధి నందు నివసిస్తున్న తెలుగుదేశం పార్టీ వీరాభిమాని పాలకిట్టి జమలయ్య ఇటీవల అనారోగ్యంతో ఆయన శివ ఐక్యం చెందారు. తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు జమలయ్య చిత్రపటానికి పూలదండ వేసి నమస్కరించి నివాళు లర్పించారు. శాసనసభ్యులు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. బిజేఆర్ నగర్ లో ఇంటింటా ఆడపడుచులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య సమస్యపై డ్రైనేజీ వ్యవస్థ పై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. జనసేన బిజెపి టిడిపి టిడిపి కుటుంబ సభ్యులు భారీగా పాల్గొన్నారు.

## ఘనంగా జరిగిన బంగ్లా స్కూల్ వార్షికోత్సవం



**పెడన,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పెడన మండలంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక బంగ్లా స్కూల్లో వార్షికోత్సవ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలోఎంఈవో -2 వై వి హరనాథ్ దాత మట్ట రాధ కృష్ణ మూర్తి ప్రధానోపాధ్యాయురాలు జి.భాగ్యలక్ష్మి, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఛైర్మన్ ఎం సుధారాణి వైస్ చైర్మన్ ఎండీ బాబు ఉపాధ్యాయు సిబ్బంది తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పెదచందా లో పోషణ్ పక్వాడా



**కృత్తివెన్ను,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలంలోని గరిసిపూడి పంచాయతీ పరిధిలోని పెద్ద చందాల అంగన్వాడి సెంటర్ నందు పోషన్ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్ సూపర్వైజర్ బి శ్యామల గౌరీ మాట్లాడుతూ గర్భవతిగా నమోదైన దగ్గరనుంచి కాన్పు సమయానికి గర్భవతి 10 నుంచి 12 కేజీల బరువు పెరగాలని, పగటిపూట రెండు గంటలు విశ్రాంతి తీసుకోవాలని , పోషకాహారంతో పాటు అంగన్వాడీ లో ఇచ్చే అనుబంధ పోషకాహారం పట్ల అ శ్రద్ధ చేయవద్దని ఈ పోషకాహారం చాలా బలమైనదని కడుపులోని బిడ్డ పెరుగుదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలియజేశారు.పెద్ద చందాల స్కూల్ హెచ్.ఎం . నరసింహస్వామి మాట్లాడుతూ అంగన్వాడికి మూడు నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను పంపించాలని ,అంగన్వాడీ కార్యకర్తలు టైమ్ ప్రకారం ఆహారం ఇచ్చి, ఆటపాటల ద్వారా విద్యను పిల్లలకు నేర్పుతారని వివరించారు. గరిసిపూడి వైస్ ప్రెసిడెంట్ బస్వాని.వీర్లంకమ్మ అంగన్వాడీలు బాగా పనిచేస్తున్నాయని అంగన్వాడీ కార్యకర్తలు బాగా పనిచేస్తున్నారని ప్రశంసించారు.ఎంపీటీసీ నడకుదుటి.పోతురాజు మాట్లాడుతూ మనం తినే ఆహారంలోనే ఆరోగ్యం ఉందని తెలిపారు .ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు లక్ష్మి అనసూయ భాగ్యలక్ష్మి ప్రియ కుమారి వరలక్ష్మి చిన్న లక్ష్మి స్కూల్ టీచర్ అశ్విని హెల్పర్ నాగలక్ష్మి గర్భవతులు బాలింతలు పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలకు డాక్టర్ మొర్రి పిచ్చయ్యకు ఆహ్వానం



**గిద్దలూరు,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ఏలూరు పట్టణంలోని మహాలక్ష్మి గోస్వామి కళ్యాణ మండపంలో మే నెల 11,12 తేదీలల్లో రెండు రోజులపాటు ప్రపంచ తెలుగు సాహితీ సంబరాలు నిర్వహించను న్నారు. శ్రీ శ్రీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సంబరాలకు గిద్దలూరు మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాదిలికొండ పల్లెలో పనిచేస్తున్న ప్రముఖ రాష్ట్ర ఉత్తమ హిందీ ఉపాధ్యాయులు డాక్టర్ మొర్రి. పిచ్చయ్యకు ఆహ్వానం అందింది. ఈ బుహత్తరమైన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఈ లేఖలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మొర్రి. పిచ్చయ్యకు పలు ఉపాధ్యాయ సంఘాలు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం పాల్గొనడానికి అవకాశం కల్పించిన శ్రీ శ్రీ కళావేదిక సభ్యులకు పిచ్చయ్య ధన్యవాదాలు తెలిపారు.

## హనుమాన్ జంక్షన్ మానవత ప్రెసిడెంట్‌గా బాణాల నరసింహారావు



**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** 2025u2026 సంవత్సరానికి మానవతా హనుమాన్ జంక్షన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం మానవత కార్యాలయంలో జరిగిన ఏకగ్రీవంగా చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు పర్యవేక్షణలో ఎన్నుకున్నారు. అధ్యక్షులు గా బాణాల నరసింహారావు, కార్యదర్శి పాబోలు గణేష్ బాబు ,ట్రెజరర్ గా ఘంటా ఇందిరా దేవి, ఉపాధ్యక్షులు గా రేవిణిశెట్టి సూర్యనారాయణ, సహాయ కార్యదర్శి గా మరీదు వెంకటస్వామి ని ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు గా బీరం వెంకట సుబ్బారావు, పులప రాజారావు,ఉడత కృష్ణమోహన్, గోళ్ళ మల్లికార్జునరావు ను ఎన్నుకున్నారు. డైరెక్టర్స్ బోర్డు ఏకగ్రీవంగా వీరందరినీ ఎన్నుకుందని చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు ప్రకటించారు.

## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడమే మనం ఉన్నందున లక్ష్యం: ఎంఈవో వై వి హరనాథ్



**పెడన,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే మన ముందున్న లక్ష్యమని ఎం వైవి హరినాథ్ పిలుపునిచ్చారు.పెడనలోని స్థానిక బంగ్లా స్కూల్లో జరిగిన వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరంలో భాగంగా మోడల్ ప్రైమరీ స్కూళ్ళను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఇందులో భాగంగా బంగ్లా స్కూల్ కూడా ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ గా ఎంపికైందని దీనికి అనుగుణంగా తరగతికి ఒకటి చొప్పున ఐదుగురు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు బోధిస్తారని దీని ఫలితంగా విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింతగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని అన్నారు. కావున తల్లిదండ్రులు ఇటువంటి చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మీ పిల్లలు బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అన్నారు.దాత మట్ట రాధాకృష్ణమూర్తి గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారు ఎంతోమంది ఉన్నత స్థానంలో ఉన్నారని కావున తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలను ఆదరించాలని అన్నారు.హెచ్ఎం జి.భాగ్యలక్ష్మి తల్లిదండ్రులతో మాట్లాడుతూ మీ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం లో మా ఉపాధ్యాయులది బాధ్యత అన్నారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అదే విధంగా 5 వ తరగతి పూర్తి చేసుకున్న 22 మంది విద్యార్థులకు ఛైర్మన్ ఎం సుధారాణి వైస్ ఛైర్మన్ ఎం డి బాబు లు వారి వితరణ గా ప్రత్యేక బహుమతులు ప్రధానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది కార్యాలయ సిబ్బంది తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురికి మంత్రి సుభాష్ రూ.20 వేలు ఆర్థిక సహాయం

● ఇంటర్ టాపర్ కు రూ.10 వేలు, యాక్సిడెంట్ బాధితునికి 10 వేలు ఆర్థిక సహాయం





**రామచంద్రపురం,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** రామచంద్రపురం నియోజవర్గం ఎర్ర పోతవరం గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని వాసంశెట్టి ఉమా గౌతమికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల విడుదలైన జూనియర్ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో కళాశాల టాపర్ గా నిలిచిన ఉమా గౌతమిని ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ప్రత్యేకగా అభినందించారు. మా తండ్రి వాసంశెట్టి సత్తిబాబు నిరుపేద దివ్యాంగుడైనందున సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకోడానికి తగిన ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి సుభాష్ హామీతో ఉమా గౌతమి కుటుంబంతో పాటు, కూటమి నాయకులు, స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

**రోడ్డు ప్రమాద బాధితునికి ఆర్థిక సహాయం..** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలాంత్రం గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త దార్ల శ్రీనివాస్ కు మంత్రి సుభాష్ రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. తొలుత ఆ కుటుంబాన్ని పరామర్శించి, ధైర్యం చెప్పారు.తగిన విశ్రాంతి తీసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. మంత్రి వెంట కూటమి నాయకులు,స్థానిక ప్రజలు ఉన్నారు.మంత్రి సుభాష్ సేవా కార్యక్రమాల పట్ల నియోజకవర్గంలోని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

## వైఎస్ జగన్ ను కలిసిన ముద్రగడ



**కిర్లంపూడి,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ను తాడేపల్లి లో మాజీ మంత్రి వైసిపి పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం, వైసీపీ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. వైసీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సమావేశంలో వైఎస్. జగన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ మంత్రి వైసీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం హాజరయ్యారు. ముద్రగడ పద్మనాభం వైసీపీ పొలిటికల్ అడ్వైజర్ కమిటీ సభ్యులుగా నియమించినందుకు వైఎస్ జగన్ కు ముద్రగడ పద్మనాభం కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్ జగన్ ముద్రగడ పద్మనాభంకు పార్టీని ముందుకు నడిపించేలా కృషి చేసి కూటమి ప్రభుత్వం చేసే అరాచకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లే బాధ్యత తీసుకోవాలని ముద్రగడకు జగన్ సూచించారు.నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా కార్యకర్తలకు ప్రజలకు అండగా ఉంటున్నామని జగన్ కు ముద్రగడ వివరించారు. పార్టీ విజయానికి పార్టీ బలోపేతం చేయడానికి నిరంతరం శ్రమిస్తానని నా వంతు కృషి చేసి మిమ్మల్ని మళ్ళీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసే వరకు కష్టపడి పనిచేస్తానని జగన్ కు ముద్రగడ తెలిపారు.

## ప్రారంభమైన కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ శాఖ క్రీడా సాంస్కృతిక పోటీలు




**గుడివాడ, ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం - 2025 ను పురస్కరించుకొని కృష్ణాజిల్లా పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగుల క్రీడా పోటీలు సాంస్కృతిక కార్యక్రమాలు పోటీలు జరిగాయి. జిల్లా పంచాయతీ అధికారిణి డా..జె అరుణ ఆధ్వర్యంలో గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం నందు అట్టహాసంగా ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్ చెస్ క్యారమ్స్ కబడ్డీ బాడ్మింటన్ మ్యూజికల్ చైర్స్ లతో పాటు ఇతర పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని పంచాయతీరాజ్ శాఖ ఉద్యోగులందరూ క్రీడా పోటీలలో ఉత్సాహంగా పాల్గొని వారి క్రీడా స్ఫూర్తిని చాటారు.

## యల్.బి.ఆర్.సి.ఈ లో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం పై అవగాహన సదస్సు




**మైలవరం,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రకృతి ఎన్విరాన్మెంట్ క్లబ్ ఆధ్వర్యం లో మంగళవారం ప్రపంచ ధరిత్రీ దినోత్సవం పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు కు ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు హాజరయ్యారు. విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి పలు రకాల వృక్షాలను నాటారు.అనంతరం అయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఎంతో అవసరం అన్నారు.ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ తరహా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ సంబంధిత అవగాహన పెరిగి, వారిలో బాధ్యతాభావం పెరుగుతుందని పేర్కొన్నారు.కళాశాల క్యాంపస్ పరిసరాల్లో దాదాపు 200 మొక్కలు నాటినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రకృతి క్లబ్ కో ఆర్డినేటర్స్ డా.షాహిదా నీలోఫర్, డా.వి.భాగ్యలక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డ్ కలిగిన అందరూ ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలి....

● బంటుమిల్లి ఇంచార్జ్ తాసిల్దార్ కాగిత పూర్ణచంద్రరావు..



**కృత్తివెన్ను,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** రేషన్ కార్డు లోని ఉన్న ప్రతి ఒక్కరు ఏప్రియల్ 30వ తారీకు లోపు ఈ కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని బంటుమిల్లి ఇంచార్జ్ తహసిల్దార్ కాగిత పూర్ణచంద్రరావు పత్రిక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి అని రేషన్ కార్డు లోని ప్రతి సభ్యుడు నిర్ణీత గడవలోపు( ఏప్రిల్ 30 ) కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. లేనియెడల ప్రభుత్వం వారు అందించే పథకాలకు అనర్హులవుతారని తెలియజేశారు. 5 సంవత్సరాల లోపు 80 సంవత్సరాల కంటే ఎక్కువ ఉన్నవారికి ఈ కేవైసీ నుంచి మినహాయింపు ఉందన్నారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ మొబైల్ యాప్ లో గ్రామ రెవెన్యూ అధికారి / వార్డ్ రెవెన్యూ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్ యొక్క లాగిన్ ద్వారా గాని లేదా ఎండి యు ఆపరేటర్ / రేషన్ డీలర్ వద్ద అందుబాటులో ఉన్న ఈ పాస్ పరికరాల ద్వారా గాని, ఈ కేవైసీను పూర్తి చేసుకోవాలని ఆయన పత్రికా ముఖంగా తెలియజేశారు..

## పేదవారి ఆకలిని తీరుస్తూ.. సేవారథంలో సుఖీభవ ఫౌండేషన్...



**పెడన,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** “ఆకలితో అలమటించే పేద ప్రజలకు, మీరు ఒంటరిగా లేరు మేమున్నాం” అన్న నినాదంతో పెడన పట్టణానికి చెందిన సుఖీభవ ఫౌండేషన్ సేవా రంగంలో మానవతా కార్యక్రమాలతో దూసుకుపోతోంది. పేదలకు అన్నదానం, విద్యార్థులకు విద్యాసామగ్రి, రోగులకు ఔషధ పంపిణీ వంటి అనేక కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మానవత్వాన్ని నింపుతోంది. ఈ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం బల్లిపర్రు కాలనీలో ఓ ప్రత్యేకమైన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెడన ప్రెస్ క్లబ్ సభ్యులు తమ మద్దతు తెలిపారు. ప్రెస్ క్లబ్ సభ్యులు ముందుకు వచ్చి ఫౌండేషన్ చేపట్టిన సేవా కార్యక్రమానికి తమ తోడుగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా సుఖీభవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శంకర్ మాట్లాడుతూ “పేదవారి ఆకలిని తీరించడం కంటే గొప్ప సేవ మరొకటి లేదు. అందరి సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తాం” అన్నారు.ఈ కార్యక్రమంలో పెడన ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని అన్నదానం చేశారు. అనంతరం కాలనీలోని పేదవారికి ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. ఈ సేవా కార్యక్రమం పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సుఖీభవ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు దాతలు సైతం తమ వంతు సహకారం అందిస్తూ, ఫౌండేషన్ అభివృద్ధి కి తోడ్పడుతున్నారు. ఇలాగే పేదవారిని ఆదుకునే సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ప్రెస్ క్లబ్ సభ్యులు ఆకాంక్షించారు.

## పచ్చనైన నేలే పసిడిమూట



**పోడూరు,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చింతలగరువునందు అంతర్జాతీయ మాతృ భూమి దినోత్సవం మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొల్లాబత్తుల సూర్య కుమార్ అధ్యక్షతన జరిగింది. 1970లో పర్యావరణవేత్తలైన జాన్ మెక్ కానెల్,గేలార్డ్ నెల్సన్ లు అమెరికాలో ప్రారంభించారని అన్నారు.పచ్చనైన నేల పసిడిమూట కావాలంటే అడవులను కాపాడం,ప్లాస్టిక్ వాడకం మానేయడం, మొక్కలను ఎక్కువగా పెంచడం ద్వారానే సాధ్యం అనీ,మన భూమిని సంరక్షించుకోవల్సిన బాధ్యత మన అందరిపైనా ఉన్నదని స్కూల్ హెచ్ యం కొల్లాబత్తుల సూర్య కుమార్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వీరవల్లి బాలాజీ, స్థానికురాలు కడలి సాయి దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## కేటీఆర్ చేతుల మీదుగా "ఛలో వరంగల్" వాల్ పోస్టర్ ఆవిష్కరణ



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 22 (వార్తాప్రభ):** నగరంలోని నంది హిల్స్ లోని కేటీఆర్ నివాస కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో రూపొందించబడిన "ఛలో వరంగల్" బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్ ను బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఈనెల 27న వరంగల్ లో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు కుత్బుల్లాపూర్ నుంచి బిఆర్ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుగారు, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో రెండు ప్రథమ ర్యాంకులు సాధించిన భాగ్యరధి విద్యార్థులు




**కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 22, (వార్తాప్రభ) :** చింతల్ లోని భాగ్యరధి జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో రాష్ట్రస్థాయిలో సత్తా చాటారు. సీనియర్ బైపీసీ గ్రూపులో ఆఫ్షన్ జెబీన్ 996/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. ఎంపీసీ గ్రూప్ ఎల్.రవీన 990/1000 మార్కులతో, సిఇసి గ్రూపులో షాహిమా 983/1000 మార్కులు ఎం ఇ సి గ్రూపులో బి.నందిని 983/1000 మార్కులు సాధించారు..అలాగే జూనియర్ ఎం ఈ సి గ్రూపు విద్యార్థి సానియా బేగం495/500 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించింది. బైపిసి గ్రూప్ విద్యార్థి ఎండి.అవేజ్435/440 మార్కులు, ఎంపీసీ గ్రూపు విద్యార్థి ఎల్ .అంజలి 463/470 మార్కులు , సి ఈ సి గ్రూపు విద్యార్థి ఎస్.అనూష 480/500 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన తమ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం ఎటువంటి ట్యూషన్ ఫీజు లేదన్నారు. అలాగే తక్కువ ఫీజులతో అత్యున్నత ఫలితాలు సాధిస్తున్నామని ఈ సంవత్సరం రెండు రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులు సాధించామని చెప్పారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సిహెచ్.గోవిందరెడ్డి ,కె.రామకృష్ణ ,జి.రమేష్ బాబు, నల్ల జై శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

## 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ ఎత్తున తరలిరండి.

**బా.రా.స. నాయకులు నర్సింహారెడ్డి పిలుపు**

**కూకట్ పల్లి, ఏప్రిల్ 22(వార్తాప్రభ):**ఎల్కతుర్తిలో ఈ నెల 27న



నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని వివేకానంద నగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ఉద్యమకారులు జి. నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఓ సమావేశంలో నరసింహారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంగరంగవైభవంగా రజతోత్సవ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని మండిపడ్డారు.కేసీఆర్‌ను చూడాలని, ఆయన మాట వినాలను ఈ నెల 27 కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా తీర్చిదిద్దితే.. కాం గ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో దిగజార్చిందని విమర్శించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ నుంచి రజతోత్సవ సభకు ప్రజలు కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ విప్ చొరవతో 10 కోట్లతో బాలికల హాస్టల్ మంజూరు

**రాజన్న సిరిసిల్ల , ఏప్రిల్ 22(వార్తాప్రభ)** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని అగ్రహారం డిగ్రీ కళాశాలలో బాలికల హాస్టల్ నిర్మాణానికి 10 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వుల జారీ చేశారు. కాగా గతంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఒక కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా కలశాల ప్రిన్సిపల్,విద్యార్థినీలు కళాశాలలో హాస్టల్ వసతి సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, హాస్టల్ నిర్మాణం చేయవలసిందిగా కోరుతూ వినతి పత్రం అందజేయగా, వెంటనే స్పందించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి బాలికల హాస్టల్ నిర్మాణం చేపట్టవాల్సిందిగా కోరగా, తక్షణమే స్పందించి హాస్టల్ నిర్మాణం కోసం 10 కొట్లు నిధులు మంజూరు చేయించారు.

# పారిశుద్ధ్య కార్మికుల సేవలు అనంతం!!

- కరోనా విపత్తులో "ఫ్రంట్ లైన్ వారియర్స్"గా నిలిచిన ధైర్యం వెలకట్టలేనివి
- ఇల్లు లేని శానిటేషన్ వర్కర్లకు ఇల్లు కట్టిస్తా
- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్






**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 22 (వార్తాప్రభ ప్రతినిధి)**పారిశుద్ధ్య కార్మికుల సేవలు అనంతం అని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఎన్టిపిసిలోని కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన రామగుండం నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ కార్మికులకు దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. దుస్తులు అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.....కరోనా విపత్తులో "ఫ్రంట్ లైన్ వారియర్స్"గా నిలిచిన ధైర్యం వెలకట్టలేనివి అని అన్నారు. ఇల్లు లేనటువంటి శానిటేషన్ వర్కర్లకు ఇల్లు కట్టిస్తా అని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్య సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముందు వరుసలో ఉందని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రామగుండం ఎమ్మెల్యేగా తన తోడ్పాటు ఎల్లప్పుడూ ఉంటుంది అని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, కార్మిక సంఘాల నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సాయిబాబా ఆశీస్సులు ప్రజలపై అన్నివేళలా ఉండాలని కోరుకున్నా.

- సాయిబాబా ఆలయ వార్షికోత్సవము సందర్భంగా కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 22 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని ఖాజాగూడ లో గల సాయి ఐశ్వర్య కాలనీ లోనీ శ్రీ సాయి బాబా ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు ప్రత్యేక అర్చనలు నిర్వహించి స్వామి ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలపై స్వామి వారి చల్లని చూపు ఉండాలని ప్రజలు సుఖ సంతోషాలతో ఆరోగ్యాలతో ఉండేలా చూడాలని వేడుకున్నానని తెలిపారు.ఆలయాలు మానసిక ప్రశాంతతకు ఎంతగానో దోహదపడతాయని,గచ్చిబౌలి డివిజన్ లో ఆలయాల అభివృద్ధికి తన వంతు కృషి ఎల్లప్పుడూ చేస్తానని కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి అన్నారు.భక్తిశ్రద్ధలతో స్వామి వారి వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నందుకు ఆలయ కమిటీ వారిని అభినందించారు.ఈ కార్యక్రమం లో సాయిబాబా ఆలయ ఆలయ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి,అశోక్ రాజు,రమణి,సీనియర్ నాయకులు సుమన్ అరుణ్ గౌడ్,స్థానిక నేతలు,దేవాలయ కమిటీ సభ్యులు,భక్తులు,సాయి ఐశ్వర్య కాలనీ వాసులు,పిల్లలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# నాగారం మున్సిపాలిటీలో అంబేద్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా సహపంక్తి భోజనం

- డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్ఫూర్తితో మనమంతా ఏకత్వ భావనతో జీవించాలి...
- నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి,





**కీసర, నాగారం, ఏప్రిల్ 22:(వార్తా ప్రభ)**భారత రాజ్యాంగ నిర్మాత, సామాజిక సమానత్వానికి ప్రాణం అర్పించిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వారోత్సవాల్లో భాగంగా నాగారం మున్సిపాలిటీలో సహపంక్తి భోజన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నాగారం ఎస్సీ బస్తిలోని ఎర్ర వామన్ ఇంట్లో సామూహిక భోజనాన్ని ఏర్పాటు చేసి, 'సహపంక్తి భోజనం' ద్వారా సామాజిక సమానత్వానికి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని నాగారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కొండబోయిన నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. భోజనం అనంతరం కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ అంబేద్కర్ మనకు అందించిన రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని కల్పించేందుకు మార్గదర్శకంగా నిలిచిందని, తెలిపారు. అలాగే, "అంబేద్కర్ స్ఫూర్తితో మనమంతా ఏకత్వ భావనతో జీవించాలి. సమాజంలోని అన్ని వర్గాల మధ్య సామరస్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరం. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరికి సమాన పాత్ర ఉండాలి. అందుకే మనమంతా కలిసి భోజనం చేస్తూ అంబేద్కర్ ఆలోచనలను అనుసరిస్తున్నాం, అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి తరిగొప్పుల బలరాం, మాజీ కౌన్సిలర్లు బుధవరం లక్ష్మి, బిజ్జా శ్రీనివాస్ గౌడ్, మాజీ అధ్యక్షులు బుద్ధవరం వేణుగోపాల్, నాయకులు రామక్కపేట రవీందర్ రెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, కర్ర వెంకటేశ్వరరావు, కౌకుట్ల రాహుల్ రెడ్డి, వొల్లాల శ్రీనివాస్ గౌడ్, జూపల్లి నరేష్, భువనేశ్వరి మాధవరావు, సతీష్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మారబోయిన రాజశేఖర్, షాజీ నాయర్, విజయలక్ష్మి ,మధు గౌడ్, తదితరులు పాల్గొన్నారు..

# ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు పెద్ద వరం

**శాసనసభ్యులు అరికపూడి గాంధీ**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 22 (వార్తాప్రభ):**కొండాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ ఏ బ్లాక్ కి చెందిన తెలుగుపాటి లక్ష్మీ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి సి.ఎం.ఆర్.ఎఫ్-ఎల్.ఓ.సి ద్వారా మంజూరైన 1,75,000/- ఒక లక్షల డెబ్బై ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన సి.ఎం.ఆర్.ఎఫ్-ఎల్.ఓ.సి మంజూరి పత్రాన్ని బాధిత కుటుంబానికి అందచేసిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా పీఏసి చైర్మన్ గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని పీఏసి చైర్మన్ గాంధీ తెలియచేసారు.ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పీఏసి చైర్మన్ గాంధీ పునరుద్ఘాటించారు.అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని,అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు,అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. పీఏసి చైర్మన్ గాంధీ ఈ సందర్బంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన పీఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బలరాం యాదవ్,కావూరి అనిల్,అష్రాఫ్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం పై అవగాహన సదస్సు కు రైతులు హాజరు కాగలరు

**నారాయణపేట ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బుధవారం ఉదయం 10.00 గంటలకు మన నియోజకవర్గ శాసనసభ్యురాలు చిట్టెం.పర్ణికా రెడ్డి ధన్వాడ మండల తహశిల్దార్ కార్యాలయము లో ఏర్పాటు చేసిన "భూ భారతి"చట్ట అవగాహన సదస్సు కు విచ్చేయుచున్నారు.మన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన లో భాగంగా గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం తెచ్చిన "ధరణి " భూ చట్టం తప్పుల తడకలతో అవినీతి, అక్రమాలకు అడ్డాగా మారినందున మన కాంగ్రెస్ ప్రభుత్వం అట్టి "ధరణి "చట్టాన్ని సమూల మార్పులు చేస్తూ రాష్ట్ర రైతాంగ సౌలభ్యం మేరకు భూ సమస్యలకు పరిపూర్ణ పారదర్శకతతో ఎలాంటి అవినీతికి,అక్రమాలకు తావు లేకుండా"భూ భారతి" చట్టం తీసుకువచ్చింది. కావున మండల రైతాంగానికి ధన్వాడ మండల తహశిల్దార్ కార్యాలయంలో ఇట్టి చట్టం పై అవగాహన కల్పించేందుకు "భూ భారతి "చట్టం అవగాహన సదస్సు ఏర్పాటు చేయడమైనది.

# వార్తా ప్రభ హైదరాబాద్

## కృష్ణవేణి కళాశాలలో మార్కుల సునామీ!!

- ఇంటర్ ఫలితాల్లో అన్ని గ్రూపులలో టాప్ మార్క్స్
- ఐపిఈ పరీక్షలో సత్తా చాటిన స్టూడెంట్స్
- కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు
- పట్టుదల, సాధన, లక్ష్యం విజయానికి సూత్రాలు
- కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ అండ్ చైర్మన్ డాక్టర్ నాగండ్ల జమున రవికుమార్




**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 22 (వార్తాప్రభ ప్రతినిధి)** మంగళవారం రోజున విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామ్స్ ఫలితాల్లో కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల మార్కుల సునామీ సృష్టించింది. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ 990 ఎస్.రిత్విక, 988 ఓ.యశ్వంత్, బైపిసి ఎం.దీక్షిత్ గౌడ్ 957, జవేరియా ముస్కాన్ 933, సీఈసీ ఆర్.అక్షయ 936, ప్రథమ సంవత్సరం ఎంపీసీ టి.శశాంక్ 465, సిహెచ్.సాత్విక 461, హుజాయిఫా 461, బి.శ్రీ నిహారిక 460, బైపీసీ ఎం.సాత్విక 425, సీఈసీ ముస్కాన్ అంజుమ్ 485, ఆర్.భవ్య 482 మార్కులు సాధించి రికార్డు సృష్టించినట్లు ప్రకటనలో వివరాలను వెల్లడించి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల డైరెక్టర్ అండ్ చైర్మన్ డాక్టర్ నాగండ్ల జమున రవికుమార్. కృషి ఉంటే మనుషులు ఋషులవుతారు అని, పట్టుదల, సాధన, లక్ష్యం విజయానికి సూత్రాలు అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. విద్యార్థుల విజయానికి విశిష్ట కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లకు కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు తర్వాత చదువును ఇలాగే విజయవంతంగా పూర్తి చేసి సమాజంలో ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలి అని ఆకాంక్షించారు.

## ఇంటర్ ఫలితాల్లో లింగాపూర్ మోడల్ కాలేజ్ ప్రభంజనం!!

- సత్తా చాటి విజయకేతనం ఎగురవేసిన స్టూడెంట్స్
- గురువుల కృషికి, విద్యార్థుల పట్టుదలకి ప్రతీక ఈ రిజల్ట్స్
- లింగాపూర్ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.సదానందం




**పెద్దపల్లి/ అంతర్గాం: ఏప్రిల్ 22 (వార్తాప్రభ ప్రతినిధి)** ఇంటర్ ఫలితాల్లో లింగాపూర్ మోడల్ కాలేజ్ ప్రభంజనం సృష్టించినది. ఈ మేరకు మంగళవారం విడుదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థుల వివరాలను ప్రకటనలో వెల్లడించారు లింగాపూర్ మోడల్ స్కూల్ అండ్ కాలేజ్ ప్రిన్సిపల్ పి.సదానందం. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కే.శృతి(987), జి.ఉషశ్రీ(960), బైపీసీ విభాగంలో ఎస్.దీక్షిత (947), డి.రజిత (932), సీఈసీ భాగంలో ఎన్.స్ఫూర్తి (960), ఎన్.నిఖిల్ (954) అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో విస్పక్ష (466), కే.సాహితీ (460), బైపీసీ విభాగంలో వి.సహస్ర, ఎం.నవ్య శ్రీ, సీఈసీ విభాగంలో సుమైనా(460), కే.సాయి ప్రియ(451) మార్కులతో టాపర్లుగా నిలిచారని తెలిపారు. గురువుల కృషికి, విద్యార్థుల పట్టుదలకి ప్రతీక ఈ రిజల్ట్స్ అని ప్రిన్సిపాల్ సదానందం హర్షం వ్యక్తం చేశారు. ఇలాగే బాగా చదువుకొని గ్రాడ్యుయేషనులో కూడా టాపర్లుగా నిలిచి ఉన్నతమైన స్థానంలో స్థిరపడాలని కోరారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫలితాలను చూసి తల్లిదండ్రులు, పోషక మహాశయులు ప్రభుత్వ పాఠశాల కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్ చేయించాలని విజ్ఞప్తి చేశారు.

## రజోత్సవ వేడుకలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**పేట్ బషీరాబాద్ ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 132 - జీడిమెట్ల డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ సమావేశమై ఈనెల 27వ తేదీన వరంగల్ లో నిర్వహించనున్న బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షతపై స్వరాష్ట్ర సాధన ద్వారానే మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించి కొట్లాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని అనతి కాలంలోనే అన్ని రంగాలలో అగ్రపథాన నిలిపిన మహోన్నత శక్తి, నాయకులు కేసీఆర్ అని అన్నారు. ఇంతటి ఘనచరిత్ర కలిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను జయప్రదం చేయాల్సిన బాధ్యత ప్రతీ నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. రజతోత్సవ వేడుకలకు భారీ సంఖ్యలో బయల్దేరి వెళ్ళి తమ ఐకమత్యాన్ని, క్రమశిక్షణను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## కర్మ రిటర్న్స్.. సీనియర్ ఐపీఎస్ అధికారిని వదలని పాపం..?

కర్మ రిటర్న్స్.. ఇటీవల ఎక్కువగా వినిపిస్తున్న వేదాంతం.. ఎవరినీ కర్మ వదలనే ఈ సిద్ధాంతం సీనియర్ ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయుల విషయంలో మరోసారి నిజమైందని అంటున్నారు. గత ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్ గా వ్యవహరించిన పీఎస్ఆర్ ఆంజనేయులు అప్పట్లో ప్రతిపక్ష నేతలను వెంటాడి వేటాడి అరెస్టులు చేయించారని అభియోగాలు ఎదుర్కొంటున్నారు. సీనియార్టీ ప్రకారం డీజీపీ కావాల్సిన ఆయన గత ప్రభుత్వంలో అనుసరించిన వైఖరి కారణంగా ప్రస్తుతం సస్పెన్షన్ కు గురయ్యారు. అంతేకాకుండా ముంబైకి చెందిన సినీ నటి కాదంబరి జెత్వాని కేసులో తాజాగా అరెస్టు అయ్యారు. దీంతో ఎందరినో అరెస్టు చేయించి జైలుకు పంపిన సీనియర్ ఐపీఎస్ కూడా జైలుకు వెళ్లడం కర్మ ఫలమేనన్న టాక్ వినిపిస్తోంది. పీఎస్ఆర్ ఆంజనేయులు గత ప్రభుత్వంలో ఆయన పేరు వింటేనే అంతా హడలిపోయేవారు. ఎక్కువగా అప్పటి ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలోనే తిష్టవేసి ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేలా ప్రణాళికలు రచించారని ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అందుకే కూటమి ప్రభుత్వం రాగానే ఆయనను విధుల నుంచి తప్పించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో పీఎస్ఆర్ ఆంజనేయులు కలుస్తామన్నా సీఎం చంద్రబాబు సమయం ఇవ్వలేదని ప్రచారం జరుగుతోంది. వ్యక్తిగతంగా ఎవరిపై ద్వేషం చూపని ముఖ్యమంత్రి చంద్రబాబు.. పీఎస్ఆర్ ఆంజనేయులు విషయంలో చాలా కోపంగా ఉన్నారని అంటున్నారు. దీంతో ఆయన అరెస్టు వరకు పరిస్థితి దారితీసిందని అంటున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో ఇలా ఓ ఐపీఎస్ అధికారిని అరెస్టు చేయడం చరిత్రలో ఇదే తొలిసారి అంటున్నారు. గత ప్రభుత్వంలో అప్పటి ప్రభుత్వ పెద్దల మెప్పు కోసం ముంబైకి చెందిన ఓ పారిశ్రామిక వేత్తకు అనుచిత లబ్ధి కోసం సినీ నటి కాదంబరిపై తప్పుడు కేసు నమోదు చేశారని పీఎస్ఆర్ ఆంజనేయులు అభియోగాలు ఎదుర్కొంటున్నారు. ఈ కేసులో పీఎస్ఆర్ తోపాటు మరో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులు విచారణ ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతానికి ఈ ముగ్గురు అధికారులు సస్పెన్షన్ లో ఉండగా, పీఎస్ఆర్ ను తాజాగా అరెస్టు చేశారు. ఇదే కేసులో గతంలో వైసీపీ నేత కుక్కల విద్యాసాగర్ తోపాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. పీఎస్ఆర్ అరెస్టుతో నటి కాదంబరి జెత్వానీ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారంతా హడలిపోతున్నారని ప్రచారం జరుగుతోంది. ఓ సీనియర్ ఐపీఎస్ నే అరెస్టు చేశారంటే మిగిలిన వారిని కూడా క్షమించే పరిస్థితి లేదని ప్రభుత్వం సంకేతాలు పంపిందని చర్చ జరుగుతోంది. నటి కాదంబరి జెత్వానీ కేసుతోపాటు ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు ఎంపీగా ఉండగా, ఆయనపై కస్టోడియల్ టార్చర్ కేసులోనూ పీఎస్ఆర్ అభియోగాలు ఎదుర్కొంటున్నారు. రఘురామ ఫిర్యాదుపై పీఎస్ఆర్ ఆంజనేయులును నిందితుడిగా కేసు నమోదు చేశారు. ఈ పరిస్థితుల్లో ఆయనను ఆ కేసులోనూ అరెస్టు చేస్తారా? అనేది ఆసక్తి రేపుతోంది.

## కృష్ణా యూనివర్సిటీ లో ధరిత్రి దినోత్సవం వేడుకలు



మచిలీపట్నం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)కృష్ణా విశ్వవిద్యాలయం లో ధరిత్రి దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్సీసీ క్యాడెట్లు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ సందర్భంగా ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ డా. డి. రామ్ శేఖర రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు: రోజువారీ జీవితం లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలి. ప్రతి ఏడాది కనీసం ఒక మొక్క నాటి, దాని పెంపకాన్ని చూసుకోవాలి. శుభ్రత మరియు పచ్చదనం కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలి. ఇతరులకు కూడా పర్యావరణ హిత జీవనశైలిని ప్రోత్సహించాలి. సహజ వనరుల పరిరక్షణలో ఇతరులకు ఆదర్శంగా నిలవాలి. “భూమి మనదేగాక రాబోయే తరాలదికూడా, కాబట్టి దాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిదీ” అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను పర్యావరణ యోధులుగా మారాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం చివర్లో విద్యార్థులు ప్రకృతిని పరిరక్షించేందుకు ప్రతిజ్ఞ చేసారు

## సాటిలేని మేటి అమ్మ



కొనలేనిది కాసులతో
కొలువలేనిది త్రాసులతో
అమ్మ ప్రేమ అవనిలోన
తలచుకొనుము మనసులోన
మల్లెలా గుబాళించేది
వల్లిలా చిగురించేది
తల్లి త్యాగమొక్కటే
ఎల్లలసలు లేనిదది
అమ్మ మాట చల్లదనము
పిల్లలకది మూలధనము
గైకుంటే దీవెనలు
బాగుపడును జీవితాలు
అమ్మ మనసు నవనీతము
దివిలోని పారిజాతము
నొప్పిపెట్ట కూడదోయ్!
తప్పు అలా చేస్తేనోయ్!

-గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు

# వ్యాయామోపాధ్యులు గద్దె సురేష్ సేవలు అభినందనీయం

### జి ఎన్ ఆర్ ఎం సి హైస్కూలు ప్రధానోపాధ్యాయులు వీ రవి కుమార్







విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) సుధీర్ఘ కాలంగా విద్యార్థుల ఔన్నతి కోసం పాటుపడిన వ్యాయామోపాధ్యులు(పీ ఈ టీ) గద్దె సురేష్ బాబు సేవలు అభినందనీయమని జీ ఎన్ ఆర్ ఎం సి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వీ వీ రవి కుమార్ అన్నారు. గద్దే సురేష్ రామరాజ్య నగర్ లోని జీ ఎన్ ఆర్ ఎం సి ప్రాథమిక పాఠశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ పీ.ఈ.టీ గా పనిచేస్తూ ఈ నెలతో పదవి విరమణ చేయనున్నారు. వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని మంగళవారం పాఠశాల ఆవరణలో అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ ఉడా చైర్మన్ టీ ప్రేమ్ నాథ్, ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ బీ మెహర్ బాబు, మాజీ కార్పొరేటర్ జీ కోటేశ్వరరావు, ఎస్ జీ ఎఫ్ సెక్రెటరీ భానుమూర్తి రాజు, తదితరులు పాల్గొని పదవి విరమణ పొందుతున్న గద్దె సురేష్ అతని భార్య శ్రీలక్ష్మి ను పూలమాలలు, శాలువాలతో,ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వీ వీ రవి కుమార్ మాట్లాడుతూ..గత 32 సంవత్సరాలుగా వృత్తినే దైవంగా భావిస్తూ, అంకిత భావంతో పనిచేస్తూ ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది పదవి విరమణ పొందుతున్న గద్దె సురేష్ బాబు సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. పీ ఈ టి గా పనిచేస్తూ విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి , విద్యార్థులను శారీరకంగా, మానసికంగా, దృఢంగా తయారు చేశారని అన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమంలో విద్యా రంగం బలోపేతమే లక్ష్యంగా త్వరలో ప్రవేశపెట్టబోతున్న విద్యాంజలి కార్యక్రమంలో గద్దె సురేష్ భాగస్వాములవడం గర్వకారణమని తెలిపారు .ఈ సందర్భంగా ఇటీవల పది పరీక్షలలో అత్యధిక మార్కులను సాధించిన పదిమంది విద్యార్థులకు ఒక్కొక్కరికి పదివేలను అందజేయాలని గద్దె సురేష్ నిర్ణయించారు. మాజీ ఉడా చైర్మన్ డాక్టర్ టి ప్రేమనాథ్ మాట్లాడుతూ గద్దే సురేష్ పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇంటిలిజెన్స్ అడిషనల్ ఎస్పీ బీ మెహర్ బాబు మాట్లాడుతూ పదవి విరమణ అనంతరం తమ సేవలు కొనసాగించాలని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేందుకు కృషి చేయాలన్నారు. విద్యార్థులు క్రీడల పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పశ్చిమ లోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు , వివిధ సంఘాల నాయకులు జీ ఎన్ ఆర్ ఎం సి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే
## జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

### విద్యా మండలికమిషనర్ కి ఎ బి వి పి బృందం వినతిపత్రం అందజేత



విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ బృందం మంగళవారం విద్యా మండలి కమిషనర్ ని కలిశారు. వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యా మండలి కమిషనర్ డాక్టర్ కృతిక శుక్ల ఐఏఎస్ ని కలిసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఏప్రిల్ 23వ తారీకు నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థి విద్యార్థులకు వేసవికాలం సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే అయినప్పటికీ కళాశాల యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కడం ప్రతి సంవత్సరం జరుగుతూనే ఉందన్నారు. రాష్ట్రంలోని ఎన్నో కళాశాలలో ఒక గుర్తింపుతో అనేకచోట్ల కళాశాలలో నడుపుతున్నారని వీటి పైన దృష్టి పెట్టి ఫేక్ కళాశాలపై మరియు యాజమాన్యాలపై చర్యలు తీసుకొని వాటి యొక్క గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఆర్ఐఓ లు అందరూ స్థానిక ఒత్తిడిలకు తలవంచి కళాశాలలను విచ్చలవిడతనానికి వదిలివేశారని మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి జీతం చేసుకుంటూ దాంతోపాటుగా ప్రైవేటు కార్పొరేట్ కళాశాల వద్ద లక్షల లక్షలు లంచాలు తీసుకుంటున్నటువంటి ఆర్ ఐ ఓ లను వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఇంటర్మీడియట్ విద్యను కార్పొరేట్ కళాశాలల కబంధహస్తాల నుంచి విడిపించాలని లేనిచో ఏబీవీపీ రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి పిలిపించి ముందుండి పోరాటాన్ని నడిపిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్య సమితి సభ్యులు దుర్గారావు, శ్యామ్,మోషేస్, చరణ్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్షాకాలంలో విపత్తులను ఎదుర్కోవడానికి ముందస్తు ప్రణాళిక



మచిలీపట్నం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)రాబోవు నైరుతి రుతుపవనాల సమయంలో విపత్తును సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి జాగ్రత్తగా ముందస్తు ఏర్పాట్లు చేసేందుకు సమాయత్తం కావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుండి ఆర్డీవోలు జిల్లా అధికారులతో రానున్న నైరుతి రుతుపవనాల సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, ఏర్పాట్లపై గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కార్యాచరణ ప్రణాళికను పకడ్బందీగా రూపొందించాలన్నారు. తుఫానులు, అసాధారణ భారీవర్షాలు, వరదలు వచ్చినప్పుడు ఏ గ్రామాలు ప్రభావితం అయ్యాయో గుర్తించాలని అక్కడ స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్( ఎస్ఓపి) ప్రకారం ముందస్తు జాగ్రత్తలు అన్నింటిని చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి వారిని అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుందన్నారు. సహాయక శిబిరాలు ఏర్పాటు చేసే భవనాలను పరిశీలించి మరమ్మతులు, ఇతర పునరుద్ధరణ పనులు చేపట్టి పటిష్ట పరచాలని, ఇందుకోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తుఫాను షెల్టర్లను కాకుండా ఇతర ఏ భవనాలను సహాయక శిబిరాలుగా వినియోగించుకోవచ్చో గుర్తించాలన్నారు. పారిశుధ్యము, మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా తదితర అత్యవసర సేవలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇటీవల సంభవించిన భారీ వర్షాలు వరదల కారణంగా ప్రకాశం బ్యారేజ్ నీటిమట్టం ఎప్పటికప్పుడు గమనించుకుంటూ నిరంతరం పనిచేశారని అదే తరహాలో అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఎక్కడైనా భవనాలు శిథిలావస్థలో ఉంటే వాటిని తొలగించాలన్నారు మంచినీటి పైప్లైన్లు లీకేజీలు ఎక్కడైనా ఉంటే ముందుగా సరి చేయాలన్నారు. ఎక్కడైనా చెరువులు వరదలకు గండిపడితే వాటిని మూసివేసేందుకు ఇసుక మూటలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతిన్న వాటిని సత్వరమే పునరుద్ధరించేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎక్కడైనా రహదారుల్లో చెట్లు పడిపోయి గాని లేదా ఏమైనా ఇతర అడ్డంకులు ఎదురైతే రాకపోకలకు ఇబ్బంది లేకుండా వాటిని తొలగించేందుకు విద్యుత్ రంపాలు ఇతర పరికరాలు అందుబాటులో ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రభావిత ప్రాంత ప్రజలను తరలించేందుకు అవసరమైన చోట్ల వాహనాలను సమకూర్చాల్సి ఉంటుందన్నారు పెట్రోల్ బంకులలో కావలసినంత పెట్రోల్, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు ఎంఎల్ఎస్ పాయింట్లో రైతులకు ఉపయోగపడే విధంగా టార్పాలిన్ పట్టాలు చివరి నిమిషంలో కాకుండా ముందస్తుగా తెచ్చి పెట్టుకోవాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కావలసినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పంటలు దెబ్బతింటే నష్టం వాటిల్లకుండా రైతులు పండించే పంటలకు బీమా చేయించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. అలాగే పశువులకు కూడా బీమా చేయించేలాగా రైతులను ప్రోత్సహించాలన్నారు. రొయ్యలు, చేపల చెరువులు దెబ్బతినకుండ ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ఈ గూగుల్ మీట్ లో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం, గుడివాడ ఉయ్యూరు ఆర్డీవోలు స్వాతి, బాలసుబ్రమణ్యం, హేలా షారోన్ వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపిన 99 మంది వ్యక్తులకు జరిమానా విధించిన న్యాయస్థానం







విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)విజయవాడ నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు అదేశాల మేరకు నగరంలో వివిధ ప్రదేశాలలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం తేదిన1వ, 2వ, 5వ ట్రాఫిక్ పోలీసు వారు మొత్తం 99 కేసులలో మద్యం సేవించి వాహనములు నడిపే చోదకులను సంబంధిత కోర్ట్ లలో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి లెనిన్ బాబు , ఆర్.వి.శర్మ లు మొత్తం 99 మందిలో 13 మందికి ఒక్కొక్కరికి రూ.15,000/- చొప్పున మిగిలిన 86 మందికి ఒక్కొక్కరికి రూ.10,000/- చొప్పున జరిమానా విధించారు. ప్రతి రోజు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిర్వహించి పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. కాబట్టి వాహన చోదకులు ట్రాఫిక్ నియమ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలను పాటిస్తూ సురక్షితంగా ప్రయాణం చేయాలని పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు తెలియజేశారు

## భూమిని కాలుష్య కోరల నుండి కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిదీ- జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)జిల్లా ప్రజలు పర్యావరణను పరిరక్షించి ధరిత్రిని కాలుష్యం నుండి కాపాడుకొనుటకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. ధరిత్రి దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధరిత్రీ దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే ఒక పర్యావరణ అవగాహన కార్యక్రమం అన్నారు. ఇది పర్యావరణ పరిరక్షణకు మద్దతును తెలియజేయడానికి, ప్రజలలో పర్యావరణ పట్ల అవగాహన కల్పించడానికి నిర్వహించబడుతుందన్నారు. ఈ ఏడాది “అవర్ పవర్, అవర్ ప్లానెట్” %-% అంటే, మన శక్తి %-% మన గ్రహం అనే థీమ్ ఎంచుకోవడం జరిగిందన్నారు. ఇది పునరుత్పాదక ఇంధనాన్ని ప్రోత్సహిస్తూ, భవిష్యత్తు తరాల కోసం భూమిని ఆరోగ్యంగా ఉంచాలన్న సంకల్పం అని తెలిపారు. ధరిత్రి దినోత్సవంను పురస్కరించుకొని ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని తద్వారా మన ధరిత్రి ని కాలుష్యము నుండి కాపాడుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ పి శ్రీనివాస్, జిల్లా భూగర్భజల అధికారి డి.ధనుంజయ్ రావు పాల్గొన్నారు.

## ఒలంపియాడ్ లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ.

### అభినందించిన జిల్లా కలెక్టర్



మచిలీపట్నం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఒలంపియాడ్ పరీక్ష ఫలితాల్లో మచిలీపట్నం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్దులు ఉత్తమ ప్రతిభను గణపరిచారు. ఒలంపియాడ్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్దులను కృష్ణా జిల్లా కలెక్టర్ డికె బాలాజీ అభినందిస్తూ బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి దశ నుండే పిల్లలు ఆటపాటలతో పాటు చదువు పై శ్రద్ధ కలిగి ఉండాలని చిన్నతనం నుండే కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఎ. శ్రీనివాసరావు , ఈజీఎం.మురళీ కృష్ణ , ఆర్ ఐ రాజేష్ , జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ అశోక్ , డీన్ నాగేశ్వరావు , ప్రైమరీ ఇన్చార్జి పద్మ, జయ , మణికంఠ, పద్మ, గాయత్రి, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపం నుండి ఉపశమనం మజ్జిగ పంపిణీ కార్యక్రమం



మచిలీపట్నం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వచ్చే రోగులు, సందర్శకులు కు వేసవి తాపం నుండి కొంత ఉపశమనం కోసం వినూత్న రీతిలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎవరి బాధలు వారివి అనే ధోరణిలో ఉండక ఖర్చుకు సైతం వెనకాడకుండా ప్రతిరోజు ఒక్కరు చొప్పున షుమారు 5000 రూపాయలు వెచించి చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించి రోగులు ,ప్రజల కడుపు నిండుగా త్రాగే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆశాలత, డిప్యూటీ సూపర్డెంట్ శ్రీనివాస్, ఆర్ ఎం ఓ నిరంజన్ , నర్సింగ్ సూపరింటెండెంట్ , డిప్యూటీ సూసరింటెండెంట్ , పలు విభాగాలకు చెందిన ప్రొఫెసర్లు ,డాక్టర్లు, టెక్నీషియన్లు, ప్రభుత్వం అంబులెన్స్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మిశ దంపతులు



విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి) ఇంద్రకీలాద్రి పై కొలువైన శ్రీ కనక దుర్గమ్మవారిని మంగళ వారం ఉదయం ఎన్. టి. ఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మిశ కుటుం బసమేతంగా దర్శించుకున్నారు. వారిని ఆలయమర్యాదలతో స్వాగతించి, అమ్మవారి దర్శనంకు తొడ్కొని వెళ్లగా, దర్శనం అనంతరం పండితులు వేద ఆశీర్వచనం నిర్వహించి, ప్రసాదములు అందజేశా రు. ఈ కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోటేశ్వరరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి వైద్యానికి మైత్రీ ఫౌండేషన్ ఆర్థిక సాయం

**మచిలీపట్నం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నం స్థానిక టెంపుల్ కాలనీ కు చెందిన సుభాని, జరీనా దంపతులకు 10 రోజుల క్రితం వివాహం జరిగింది పండంటి కాపురానికి ఒక పాప కు జన్మనిచ్చింది. పుట్టుకతోనే పాప రక్తం లో ఇన్ఫెక్షన్, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. ఆరోగ్య సమస్యలు కారణంగా అత్యవసర చికిత్స నిమిత్తం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. ప్రతిరోజు కూలి పనులు చేసుకుని జీవనం సాగించే ఆ కుటుంబం అప్పులు చేసి సుమారు 4 లక్షలు ఖర్చుపెట్టారు. అయినప్పటికీ పాప పూర్తిగా కోలుకోవడానికి ఇంకో 3 లక్షలు అవసరం అని తెలిసి ఫౌండేషన్ సభ్యులు,దాతలు, బాధిత కుటుంబానికి లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ ఆర్థిక సహాయం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కొనకళ్ల జగన్నాథరావు చేతుల మీదగా అందించారు. ఈ సందర్భంగా కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ



గత కొంత కాలంగా మైత్రి ఫౌండేషన్ చేస్తున్న కార్యక్రమాల గురించి తాను సోషల్ మీడియా ద్వారా తెలుసుకుంటున్నానని, చాలా మంచి కార్యక్రమాలు చేస్తున్నారని తన వంతు సహకారం ఎల్లపుడూ సంస్థ కు ఉంటుందని అభినందించారు. అలాగే కొనకళ్ల జగన్నాథరావు మాట్లాడుతూ సేవే ధ్యేయం గా ఏర్పడిన మైత్రి ఫౌండేషన్ అనే సంస్థ లో అందరూ చిన్న చిన్న ఉద్యోగాలు వ్యాపారాలు చేసుకునే వాళ్ళు సభ్యులుగా ఉండి ఎవరికైన సాయం చేయాల్సి వచ్చినప్పుడు ఒక జట్టుల ఏర్పడి విరాళాలు సేకరించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. అంతేకాకుండా లక్ష రూపాయల విరాళం సేకరించడంలో ప్రత్యేకంగా కృషి చేసిన జాయింట్ సెక్రెటరీ చిలంకుర్తి దీప్తి ని సభ్యులు అభిజిత్ ని అతిథులు అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కె వేణుకుమార్, ఉపాధ్యక్షులు రిలాక్స్ ప్రసాద్, సెక్రెటరీ రాధా కృష్ణ, జాయింట్ సెక్రెటరీ దీప్తి, సభ్యులు వక్కంటి రమాదేవి, అభిజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ,భూ వివాద విషయం లో మీడియా ముందుకు గౌతు లచ్చన్న



**రెడ్డిగూడెం ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**:రెడ్డిగూడెం మండలం లో 1953లో గౌతు లచ్చన్న కొనుక్కున్న 100 ఎకరాల భూమి గురించి మాట్లాడడానికి అయన మంగళవారం నాడు మీడియా ముందుకు వచ్చారు .ఈ సమాధార్భంగా మాట్లాడుతూ 1953లో 100 ఎకరాలు కొనుగోలు చేసి దశలు దశలుగా 92 ఎకరాలు అమ్మి వేయగా 1982 ఇంకా ఉన్న ఎనిమిది ఎకరాలు అమ్మడానికి ప్రయత్నం చేయగా వివిధ పేర్లతో ఉన్న వ్యక్తులు అది కబ్జా చేసుకుని సాగు చేస్తున్నారని తెలుసుకొని నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ 71 / 1988 గా కేసుని నడిపించి 95 లో ఆ దావాలో గౌతు లచ్చన్న కి అనుకూలంగా తీర్పు వచ్చింది.తీర్పు వచ్చిన తరువాత ప్రతివాదులు అందరూ కూడాను హైకోర్టుకి అప్పీల్ కి వెళ్లారు అని అన్నారు.2011లో హైకోర్టు వారు ఆ అప్పీలని తిరస్కరించారు. 2012లో నూజివీడు సీనియర్ సివిల్ జెడ్ జడ్జి కోర్టు నందు స్వాధీన పిటిషన్ ఈ పి 7/2012 గా తీర్పు ఇచ్చారు . కోర్టు వారి ద్వారా అమీనా ఏడెకరాల 40 సెంట్లు గ్రామస్తులు సమక్షంలో గౌతు శివాజీ కి స్వాధీనం చేయడం జరిగింది అన్నారు . అప్పుడు 2011లోనే కేసు ఓడిపోతున్నాము అని భావించి హైకోర్టులో అపీలు తిరస్కారానికి గురవుతుందని తెలుసుకొని భద్రారెడ్డి వాళ్ళ సతీమణి తులసమ్మ పేరుతో ఒక గిఫ్ట్ డిడ్ చేయించడం అందులో ఎటువంటి పూర్వపు దస్తావేజు ప్రస్తావన చేయకుండా వారసత్వంగా వచ్చింది అని చెప్పటం, అయితే అక్కడ ఉన్న 100 ఎకరాలలో ప్రతి ఎకరం ఏదో ఒక సందర్భంలో గౌతు యశోదా దేవి అమ్మి ఉండవలసింది కావున కోర్టు వారు అన్ని పరిశీలించి ఓఎస్ 156 / 2012 లో 13 జూన్ 2023న ఒక తీర్పు వెలువరించి గౌతు లచ్చన్న వారసుల మీద వేసినటువంటి కేసుని కొట్టివేశారు. గ్రామస్తులందరికీ తెలుసు కుప్పి రెడ్డి వెంకట్ రెడ్డి స్థలము ఈ ఏసి 7.40 సి టి ఎస్ రాదు అన్నారు.అది ఏడెకరా 40 సెంట్లుకి ఉత్తర పక్కన ఉంటుంది. అదేవిధంగా పడమటి కోటేశ్వరరావు ద్వారా దాఖలు పడింది అని చెప్తున్న మదిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి దస్తావేజు గురించి కూడా ఎక్కడ అని ఆయన వాపోయారు.

## బెంగళూరులో కే 100, వైట్ టాప్ రోడ్స్ ప్రాజెక్టులను పరిశీలించిన విజయవాడ నగర పాలక సంస్థ కార్పొరేటర్లు









**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బృహత్ బెంగళూరు మహానగర పాలికే (గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్) లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేశారు. బీబీఎంపీ లో గల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ లో విజయవాడ కార్పొరేటర్లకు ఆహ్వానం పలికిన బిబియం సి చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఐ.ఏ.ఎస్, గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సవాళ్లు, కార్పొరేషన్ స్థితి గతులను వివరించారు.ముందుగా ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, కార్పొరేటర్ లను పరిచయం చేస్తూ, విజయవాడ నగరపాలక సంస్థ యొక్క అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజలకు అందించు సేవలను వారికి తెలియపరచారు. ఈ సందర్భంగా గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ కార్పొరేషన్ గురించి వారు చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 225 చదనపు కిలోమీటర్లతో మొదలైన బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రస్తుతం 700 చదనపు కిలోమీటర్ల విస్తరణలో, ఒక కొట్టి నలభై ఒక లక్షల జనాభాతో, గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ గా 8 జోన్ లతో అభివృద్ధి చెందిందని తెలిపారు. 25 నుండి 30 సంవత్సరాలు ఏవిధమైన నిర్వాహణ ఖర్చు లేకుండా ఉండే వైట్ టాప్ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారని ప్రస్తుతం బెంగళూరు నగరంలో 200 కిలోమీటర్ల వరకు వైట్ టాప్ రోడ్లు వివిధ ప్రాంతాలలో ఉన్నాయని అన్నారు. నగరంలో మురుగునీటి పారుదలకు సంబంధించి కే 100 ప్రాజెక్ట్ ని ప్రస్తుతం చేపడుతున్నారని, కోరమంగళ వ్యాలీ నుండే మొదలై 100 కిలోమీటర్ల వరకు ఉన్న ఈ ప్రాజెక్టుకు కే..100 స్ట్రామ్ వాటర్ డ్రైన్ ప్రాజెక్ట్ సంబంధిత ప్రాజెక్ట్ అని, వర్షం పడినప్పుడు రోడ్డు మీద నీటి నిలువలు చేరకుండా ఉండేందుకు ఈ ప్రాజెక్టు చేపట్టారని, అందులో భాగంగా 100 కిలోమీటర్ల దూరం వరకు ఈ ప్రాజెక్టుని అభివృద్ధి పరుస్తున్నారని, ప్రస్తుతం 11 కిలోమీటర్లు పూర్తి చేశారని అన్నారు. కే...100 ప్రాజెక్ట్ లో భాగంగా సహజ పద్ధతిలో స్ట్రామ్ వాటర్ డ్రైన్ లో కాలుష్యాన్ని కాలవలో పెరిగే మొక్కల ద్వారా తగ్గిస్తూ నీటి శుద్ధత చేస్తున్నారని, కేవలం వర్షపు నీటి డ్రైన్ మాత్రమే కాకుండా పచ్చధనాన్ని పెంపొందించి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అక్కడ అందిస్తున్నారని తెలిపారు.భారతదేశంలోనే క్లైమేట్ యాక్షన్ ప్లాన్ నిర్వహించడంలో బెంగుళూరు 3వ నగరము అని, అందులో భాగంగా పర్యావరణం, సరస్సులు, అభివృద్ధి పరుస్తున్నారని తెలిపారు. గ్రేటర్ బెంగళూరు మున్సిపల్ కార్పొరేషన్ ముఖ్యంగా నాలుగు సవాళ్లు ఎదుర్కొంటుందని అవి వ్యర్థాలు, రోడ్లు, లైటింగ్, సరస్సులని తెలిపారు బీబీఎంపీ చీఫ్ కమీషనర్. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి గాలి నాణ్యత సరస్సులలో నీటి సాంద్రత, వెహికల్ ట్రాకింగ్ వంటి అంశాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు, బీబీఎంపీ కి సంబంధిత సందేహాలను అడిగి తెలుసుకున్నారు. బిబిఎంసి చీఫ్ కమిషనర్ డిప్యూటీ మేయర్ అవుతూ శ్రీ శైలజ రెడ్డి, వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ, టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఉమ్మిడి వెంకటేశ్వరావు, బుల్లా విజయకుమార్ బీజేపీ ను సన్మానించారు. వైసీపీ ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ బి బి ఎం సి అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలిపి, వారి విజ్ఞానం యాత్రలో మంచి విజ్ఞానానికి కల్పించినందుకు విజయవాడ నగర పాలక సంస్థ తరఫున బీబీఎంసీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరి నాథ్ ఐ. ఏ. ఎస్ ను సత్కరించారు. తదుపరి బీబీఎంసీ సిబ్బంది, కె.ఆర్ రోడ్డు ను చూపిస్తూ 15 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు అని దానికి ఇప్పటివరకు ఎటువంటి నిర్వహణ కార్యక్రమాలు చేపట్టలేదని, ఇంకో 15 సంవత్సరాల వరకు దానికి ఎటువంటి నిర్వహణ ఖర్చు అవసరం ఉండదని తెలిపారు. శాంతి నగర్ లో గల కే..100 ప్రాజెక్టులను ఫీల్డ్ లో చూపించి వివరించారు.

## కేశినేని చిన్ని పై నాని ఆరోపణలు అర్థరహితం

**48వ డివిజన్ టిడిపి అధ్యక్షులు పేరాబత్తుల రమణ విమర్శ**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పై మాజీ ఎంపీ కేశినేని నాని చేసిన ఆరోపణలు పూర్తిగా అర్థరహితమని తెలుగుదేశం 48 వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ ఘాటుగా విమర్శించారు. మంగళవారం చిట్టినగర్ లోని 48వ డివిజన్ టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఐటీ సెజ్ భూముల కేటాయింపు విషయంలో కేశినేని చిన్నికి ఏమాత్రం ప్రమేయం లేకపోయినా ఆయనపై నాని అర్థం పర్థం లేని ఆరోపణలు చేశారని విమర్శించారు. నిస్వార్థ ప్రజా సేవకుడైన కేశినేని శివనాద్ చిన్ని తాను ఎంపీగా పోటీ చేయకముందే అనేక ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని చెప్పారు. ఉచితంగా అన్న క్యాంటీన్ల నిర్వహణ, మెగా మెడికల్ క్యాంపుల నిర్వహణ, అలాగే బడుగు బలహీన వర్గాల ప్రజల జీవనోపాధి కోసం కుట్టు మిషన్లు, తోపుడుబండ్లు, ఇస్త్రీ పెట్టెలు తదితర ఉపకరణాల పంపిణీ వంటి ఎన్నో ప్రజా హిత కార్యక్రమాలను కేశినేని చిన్ని నిర్వహించారని రమణ చెప్పారు. రాజకీయ సన్యాసం తీసుకున్నానని చెప్పిన కేశినేని నాని ఇప్పుడు ఇలాంటి ఆరోపణలకు పాల్పడడం దారుణమని అన్నారు. తెలుగుదేశం 48, 49 డివిజన్ల క్లస్టర్ ఇంచార్జి గణప రాము మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు చిన్నిని విమర్శించే అర్హత నానికి లేదని అన్నారు. ప్రజా నాయకులైన కేశినేని చిన్ని విజయవాడ నగరాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్న విషయం అందరికీ తెలుసని అన్నారు. ఈ సమావేశంలో తెలుగుదేశం నాయకులు ఉప్పాడి రాము, ఎస్.కె నాగూర్, పఠాన్ అక్బర్, బోయళ్ళ కృష్ణ, చొక్కర అప్పారావు ,ఎస్.కె కాజా, రాయన రాజా ,ముచ్చిపల్లి శ్రీను, పొన్నాడ రాము, సలీం ,లొల్ల కరుణాకర్, పేరాబత్తుల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పాత్రికేయుల సొసైటీ స్థలంలో కార్యాలయ గది ఏర్పాటుకు ఆమోదం

**సొసైటీ సభ్యుల విజ్ఞాపనపై జిల్లా కలెక్టర్ అంగీకారం**

**సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా.....యార్లగడ్డ**



**విజయవాడపశ్చిమ ఏప్రిల్ 22: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని 'ది విజయవాడ వర్కింగ్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్' స్థలంలో సొసైటీ కార్యాలయంగా ఓ గది నిర్మించుకోడానికి ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అనుమతించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రూరల్ మండల తహశీల్దార్ సుగుణ ఆధ్వర్యంలో సొసైటీ స్థలంలోని ఆక్రమణలు తొలగించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు సమక్షంలో మంగళవారం ఉదయం కలెక్టర్ లక్ష్మీశను సొసైటీ డైరెక్టర్లు, సభ్యులు పలువురు కలిసి ధన్యవాదాలు తెలిపారు. హౌసింగ్ సొసైటీ స్థలం తిరిగి దురాక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అయితే, ప్రస్తుతానికి స్థలం సరిహద్దుల వెంబడి మొక్కలు నాటిద్దామని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వం సొసైటీకి కేటాయించిన స్థలాన్ని నిరంతర నిఘాతో కాపాడుకోవాల్సిన బాధ్యత సభ్యులపైనే వుందన్నారు. ఇదే సందర్భంలో చిన్నపాటి కార్యాలయ గది ఏర్పాటు చేసుకుంటామని కోరగా, కలెక్టర్ అందుకు అంగీకరించారు. రాష్ట్ర రాజధాని ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న విజయవాడ నగరంలో పాత్రికేయులకు గృహ సముదాయం నిర్మిస్తే రాష్ట్రమంతటికీ ఇదో మోడల్ గా నిలుస్తుందని ఆయన అన్నారు. రెవెన్యూ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సీసీఎల్ఏ కమిషనర్ జయలక్ష్మి దృష్టికి ఈ స్థలం విషయం తీసుకొని వెళ్లాలని కలెక్టర్ పాత్రికేయులకు సూచించారు. ఉన్నతాధికారి దృష్టిలో ఉంటే జిల్లా యంత్రాంగం సంప్రదింపులు జరపడానికి తేలికగా ఉంటుందని ఆయన వివరించారు.గన్నవరం శాసనసభ్యులు అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించినపుడు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ద్వారా సొసైటీ స్థలంలో పాత్రికేయులకు గృహ సముదాయాలు నిర్మిస్తామని రాష్ట్ర సమాచార – పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చిన విషయాన్ని కూడా సొసైటీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, ప్రజలు – ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేసే పాత్రికేయుల ఈ దీర్ఘకాల సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా సహకరించాల్సిందిగా ప్రభుత్వ విప్ వెంకట్రావు కలెక్టర్ ను కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ ను త్వరలోనే కలిసి సమస్యను వారి దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు. రానున్న కొద్దిరోజుల్లోనే శంకుస్థాపన కూడా జరిగేలా జిల్లా యంత్రాంగం సహకరించేలా కలెక్టర్ చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సొసైటీ అధ్యక్షుడు చిగురుపాటి సతీష్ బాబు నేతృత్వంలో డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

# గోవుల మృతిపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరపాలి

● 'హిందూ ధర్మం-గోమాత యొక్క విశిష్టత'పై సదస్సులో వక్తలు ● హిందూ ధర్మ పరిరక్షణలో కూటమి ప్రభుత్వం విఫలం: మల్లాది విష్ణు





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హిందూ ధర్మాన్ని కాపాడటం, గోవులను సంరక్షించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఏపీ సాధు పరిషత్ అధ్యక్షులు స్వామి శ్రీనివాసనంద సరస్వతి మండిపడ్డారు. లబ్బీపేటలోని లీలావతి కళ్యాణ మండపం నందు 'హిందూ ధర్మం–గోమాత యొక్క విశిష్టత'పై సాధు పరిషత్ ఆధ్వర్యంలో గురువారం సదస్సు నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి వక్తలు ప్రసంగించారు. సమస్త సృష్టికి తల్లి గోమాత అని ఈ సందర్భంగా స్వామి శ్రీనివాసనంద సరస్వతి చెప్పారు. గోవిందుని మనం పూజిస్తే.. గోవిందుడు గోవులను పూజించారని చెప్పారు. కపిల మహర్షి సాక్షాత్తూ శ్రీవారికి గోవులను సమర్పించినట్లు పురాణాలు చెబుతున్నాయన్నారు. అటువంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన తిరుమలలో గోవులకు రక్షణ లేకపోవడం బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక హిందూ ధర్మంపై దాడులు, అపచారాలు ఎక్కువయ్యాయని స్వామీజీ అన్నారు. గోశాల నుంచి ఒక గోవు బయటకు వచ్చి రైలు కింద పడి మృతి చెందడం యావత్ హిందువులను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. అసలు గోశాల సిబ్బంది ఏం చేస్తున్నారు..? గోవుల పరిరక్షణకు భక్తులు సమర్పిస్తున్న కోట్లాది రూపాయల నిధులు ఏమవుతున్నాయని సూటిగా ప్రశ్నించారు. గోవులకు రక్షణ లేనిచోట గోవిందునికి మాత్రం రక్షణ ఎలా ఉంటుందనే అనుమానం ప్రస్తుతం భక్తులలో నెలకొందన్నారు. ప్రతినెలా సగటున 15 గోవులు మృత్యువాత పడుతున్నట్లు టీటీడీ ఈవోనే వెల్లడించారని.. ఇది మన రాష్ట్రానికి, దేశానికి అరిష్టం కాదా..? అని మండిపడ్డారు. ఈ ప్రభుత్వం వచ్చాక గోవులను కూడా సంరక్షించుకోలేని దయనీయ స్థితిలో టీటీడీ ఉందని.. ఆవులు మరణిస్తే కనీసం శాంతి హోమం కూడా నిర్వహించడం లేదన్నారు. పైగా గోవులన్నీ ఒకేసారి వృద్ధాప్యానికి వచ్చి మరణించాయని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు.కేంద్రం తక్షణమే జోక్యం చేసుకుని నిష్పక్షపాతంగా దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అలాగే హిందూ ధర్మ పరిరక్షణకు ఇటువంటి సదస్సు నిర్వహించిన మల్లాది విష్ణుకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మల్లాది విష్ణు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హిందూ ధర్మంపై దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. ముఖ్యంగా తిరుమల గోశాల నిర్వహణ సరిగా లేదని.. గోవులకు సరైన వైద్యం, ఆహారం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాది తిరక్కుండానే వందల గోవులు మృతి చెందడం గతంలో ఎన్నడూ లేదన్నారు. పైగా ప్రశ్నించిన వారిపై ఈ ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు గోవుల మరణాలపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్, ఈఓ పొంతన లేని మాటలు మాట్లాడటం భక్తులను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయన్నారు. కాశీనాయన క్షేత్ర పరిరక్షణకు ఆనాడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముందుచూపుతో కేంద్రానికి లేఖ రాశారని గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక క్షేత్రంలోని అన్నదాన సత్రాన్ని, గోశాలను అటవీ శాఖ అధికారులు కూలగొడితే.. ఆ శాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఎందుకు నోరుమెదపలేదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్ల పాటు హిందూ ధర్మాన్ని కాపాడుతూ ముందుకు వెళ్లిందని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం తగులబడితే ఆఘమేఘాల మీద కొత్త రథాన్ని సిద్ధం చేయటం జరిగిందని గుర్తు చేశారు. కానీ ఈ ప్రభుత్వం అడుగడుగునా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని మండిపడ్డారు. రామతీర్థం ఆలయంలో రాముడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందించారని ఆరోపించారు. మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు చేతుల మీదుగా ఆ సాయం అందించినట్లు మండిపడ్డారు. తాజాగా శ్రీకూర్మంలో విష్ణు రూపమైన నక్షత్ర తాబేళ్లు మృత్యువాతపడితే.. పెట్రోల్ పోసి తగులబెట్టడం కలిచివేసిందన్నారు. అదే గత వైసీపీ ప్రభుత్వంలో అక్కడి తాబేళ్ల పార్కులో ప్రతి తాబేలుకూ నంబర్ కేటాయించేవారని.. వాటి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు చూసేవారని చెప్పారు. మరణించిన తాబేళ్లకు పోస్టుమార్టం కూడా నిర్వహించేవారని వెల్లడించారు. ఇప్పుడు ఆ పరిస్థితులు తారుమారయ్యాయని.. వాటిని పట్టించుకునే వారే కరవయ్యారన్నారు. హిందూ ధర్మాన్ని ఎటు తీసుకువెళ్లదలచుకున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వం వచ్చాక ఇటువంటి అపచారాలు తరచూ చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. గతంలోనూ చంద్రబాబు హయాంలో శతాబ్దాల నాటి చరిత్ర ఉన్న పురాతన ఆలయాల మొదలు చిన్న ఆలయాల వరకు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తొలగించారని మల్లాది విష్ణు విమర్శించారు. మరీ ముఖ్యంగా విజయవాడ నగరంలో పదుల సంఖ్యలో ఆలయాలను కూల్చివేశారని.. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ ఆలయాలను పునర్నిర్మించడం జరిగిందన్నారు. అలాగే అలిపిరిలో శ్రీవారి పాదాల చెంత ముంతాజ్ హోటల్ నిర్మాణంపై మాట్లాడిన సాధువుల పట్ల ఈ ప్రభుత్వం కేసులు పెట్టి దుర్మార్గంగా వ్యవహరించిందన్నారు. తాము ఆందోళన చేయడానికి వెళ్లడం లేదని, స్వామిని దర్శించుకుని వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పినా ఈ ప్రభుత్వం మొండిగా వ్యవహరించిందన్నారు. పైగా మెడలు పట్టుకుని సాధువులను బలవంతంగా వ్యాను ఎక్కించడం ఈ ప్రభుత్వ దురహంకారానికి అద్దం పడుతోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో హోటల్ నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వకపోయినా.. అప్పట్లో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన రాద్ధాంతం అంతా ఇంతా కాదని మల్లాది విష్ణు అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం హిందూ ధర్మాన్ని గౌరవించి గోవులను పరిరక్షించాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా హైందవ సోదరులు ఏకమై ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించడం ఖాయమని హెచ్చరించారు.

**ఓంకార్ స్వామి మాట్లాడుతూ..** కూటమి ప్రభుత్వం తిరుమల క్షేత్రాన్ని ఒక వ్యాపార కేంద్రంగా మార్చివేసిందని మండిపడ్డారు. శ్రీవారి దర్శనాలలో సామాన్యులకు పెద్దపీట వేస్తామని ఓ వైపు చెబుతూనే.. మరోవైపు వీఐపీల సేవలో ఈ ప్రభుత్వం తరిస్తోందని విమర్శించారు. తిరుమలలో రాజగోపురానికి మించి ఏ కట్టడం జరగకూడదని నియమావళి స్పష్టంగా ఉన్నప్పటికీ.. బసవేశ్వర వీర శైవ సంఘ్ (బి వి ఎస్ ఎస్ ) వారు రాజగోపురానికి మించి కట్టడం ఎలా చేపట్టారని ప్రశ్నించారు. దీనిపై తాము ఫిర్యాదు చేసినా ఈ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. ఇటువంటి ఉదాహరణలు ఈ ప్రభుత్వంలో కోకొల్లలు అని మాట్లాడారు. తిరుమల గోశాలకు కూతవేటు దూరంలోనే వెటర్నిటీ యూనివర్శిటీ ఉందని.. అయినా కూడా ఇన్ని ఆవులు మృతి చెందుతుంటే ఎందుకు అధ్యయనం చేయించలేదని ప్రశ్నించారు.

**స్వామి శివానంద సరస్వతి మాట్లాడుతూ..** కూటమి ప్రభుత్వంలో తిరుమలలో రోజుకో వివాదం తెరపైకి వస్తోందని ఆరోపించారు. కనుక తిరుమల తిరుపతి దేవస్థాన ప్రక్షాళన అలిపిరి నుంచి జరగాలన్నారు. గోపూజ ముక్కోటి దేవతల పూజా ఫలంతో సమానమని స్వామీజీ అన్నారు. హిందూ ధర్మంలో గోమాతకు తల్లి స్థానం ఇచ్చారనీ.. అందుకే గోవును గోమాత అంటారన్నారు. సకల దేవతా స్వరూపాలైన గోవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి జిల్లాలోనూ టీటీడీ ఆధ్వర్యంలో గోశాలలను నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జ్యోతి స్వరూపానంద స్వామీజీ, పూర్ణానంత స్వామీజీ, శివ స్వామీజీ, శ్యామలానంద ప్రసాద్ స్వామీజీ, లక్ష్మీ శివానంద స్వామీజీ, సత్య జ్ఞానానంద స్వామీజీ, ఆత్మానంద లహరి స్వామీజీ, సత్యనారాయణ స్వామి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డీసిల్టింగ్ ప్రక్రియ నిరంతరం జరుగుతుండాలి

**విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలో డీసెల్టింగ్ పనులు ఎప్పటికప్పుడు జరుగుతూ ఉండాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్, డ్రైన్ వీధి, సుబ్బారామయ్య వీధి, నెహ్రూ రోడ్డు, బాబు రాజేంద్ర ప్రసాద్ రోడ్డు, గాంధీజీ మహిళా కళాశాల అన్న క్యాంటీన్, యం.జి రోడ్డు, ఈట్ స్ట్రీట్ ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డీసిల్టింగ్ పనులను నిరంతరం చేస్తూ, సరవేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వర్షపు నీటి నిల్వలు రోడ్డు మీద ఉండకుండా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్ వీధి, వన్ టౌన్లో గల డ్రైన్ ను పరిశీలించి అక్కడున్న ఫ్లోటింగ్ వ్యర్థాలు, డిసిల్టింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని అన్నారు. గాంధీజీ మహిళా కళాశాల వద్దగల అన్న క్యాంటీన్ ను పరిశీలించి, ఆహార నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి, వాడుక నీటి సరఫరా వంటి అంశాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు ఎప్పటికప్పుడు తమ తమ అన్న క్యాంటీన్లను పరిశీలిస్తూ ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఎంజీ రోడ్డు ఈట్ స్ట్రీట్ పర్యటించి క్షేత్రస్థాయిలో పారిశుధ్య నిర్వహణ పరిశీలించారు. నిత్యం ఆహారం సేవించడానికి రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పారిశుధ్య నిర్వహణ ఎంతో ముఖ్యమని అందుకు అనుగుణంగా అధికారులు ఎప్పటికప్పుడు పరిశుభ్రమైన వాతావరణం ప్రజలకు కల్పించాలని అన్నారు. ఈ పర్యటనలో ఇన్చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, ఎగ్జిక్యూటివ్ ఎంజాయ్ సురేఖ, సిబ్బంది,స్థానిక 53 వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు పాల్గొన్నారు.

# ఘనంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుపాటి పురంధేశ్వరి జన్మదిన వేడుకలు

## వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న నూతలపాటి బాలకోటేశ్వరరావు





**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 22(వార్తా ప్రభ ప్రతినిధి):**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ రథసారథి రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురందరేశ్వరి జన్మదిన వేడుకలు బిజెపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మైలవరం నియోజకవర్గ కన్వీనర్ నూతులపాటి బాల కోటేశ్వరరావు (బాల) పాల్గొన్నారు. ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల పరిధిలోని కాచవరం గ్రామంలోని అమ్మానాన్న వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.కేక్ కట్ చేసి తమ అభిమాన నాయకురాలికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా బాల మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ పురందేశ్వరి సారధ్యంలో మరింత అభివృధ్ధి జరగాలని,పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బిజెపి పాలన ముందుకు సాగుతుందని, అందరి ఆశీస్సులతో, ఆయురారోగ్యలతో మరెన్నో పుట్టిన రోజులు జరుపుకావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షురాలు తమ్మినేని మాధురి,మండల అధ్యక్షురాలు పయ్యావుల జయలక్ష్మి,గొల్లపూడి మండల అధ్యక్షులు తుమ్మల శ్రీ కుమార్, బిజెపి నాయకులు పయ్యావుల రాము, యుగంధర్, తిరుపతి నాయుడు,భవాని కుమారి,నాగమణి, స్వాతి, సత్య రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా చైతన్యంతోనే సమాజ ప్రగతి

## కేబీఎన్ కళాశాలలో యుజిసి ఉమెన్స్ స్టడీ సెంటర్ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో వక్తలు




**విజయవాడ పశ్చిమ:-ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సమాజంలోని ప్రతి మహిళ విద్యావంతురాలై సాధికారత సాధించినప్పుడే సమాజ చైతన్యం సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏపీహెచ్ఆర్ అండ్ ఎంసి చైర్‌పర్సన్ ఎం.వెంకటరమణ అన్నారు. కేబీఎన్ కళాశాలలో యుజిసి ఉమెన్స్ స్టడీ సెంటర్ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమాల ప్రారంభోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ, వేలాది మంది మహిళలను వివిధ రకాల వృత్తి విద్యల ద్వారా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడంతో పాటు విద్యావ్యవస్థను వ్యాపార దృక్పథంతో కాకుండా సమాజ సేవగా నిర్వహిస్తున్న కేబిఎన్ కళాశాల యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడారు. మహిళ ప్రతి కుటుంబానికి వెన్నెముక అని, మహిళ ఆర్థికంగా ఎవరి మీద ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదని అన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ, దిగువ, మధ్యతరగతి కుటుంబాలకు తమ కళాశాల పూర్తిగా అండగా ఉంటుందన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ, మహిళ ప్రస్తుత సమాజంలో వంటింటి నుంచి అంతరిక్షం దాకా ప్రతి రంగంలోనూ పురుషులను మించి విజయాలు సాధిస్తుందన్నారు. ఇంచార్జి ప్రిన్సిపల్ పి.ఎల్.రమేష్ మాట్లాడుతూ, వేసవికాలంలో 40 రోజులపాటు మహిళలు చిన్నపిల్లల కోసం 30 రకాల కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉమెన్ స్టడీ సెంటర్ ఇంచార్జి పి.స్వప్న, గౌతమీ దేవి, స్వాతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది శిక్షణ పొందిన పలువురు మహిళలు, విద్యార్థులకు జస్టిస్ రమణ సర్టిఫికెట్లు అందజేశారు.

# మంచి మనసు చాటుకున్న ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ.

## ముదినేపల్లి ఆర్టీసీ బస్టాండ్ కు కూలింగ్ వాటర్ కూలర్ బహుకరణ.



**ముదినేపల్లి ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ముదినేపల్లి బస్టాండ్ కి కూలింగ్ వాటర్ కూలర్ బహుకరించిన ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ.ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ ముదినేపల్లి లోని ఏపీ ఆర్టీసీ బస్టాండ్ లో వేసవికాలం దృశ్య ప్రయాణికులు ఎవరు ఇబ్బంది పడకూడదని కూలింగ్ వాటర్ కూలర్ ను,ఆ సంస్థకు బహుకరించారు.ఈ ఉదయం ఎంపిపి సత్యనారాయణ ఏలూరు ఏపీ ఆర్టీసీ సీఐ మురళీ తో కలిసి కూలింగ్ వాటర్ కూలర్ ను ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ.రోజురోజుకు ఎండలు పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు చల్లటి తాగునీటిని అందించడం పట్ల ఎంపిపి ని అభినందించారు.నిత్యం పరిసర గ్రామాల నుంచి ముదినేపల్లి బస్సు స్టాండ్ వద్ద.త్రాగునీరు లేకపోవడం వళ్ళ ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.ఈరోజు నుంచి డ్రింకింగ్ వాటర్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అయన కోరారు.ఈ కార్యక్రమం లో ఆర్టీసీ సీఐ మురళీ, ఆర్టీసీ కాంట్రాక్టర్ కృష్ణ మూర్తి, పేర్ని పృథ్వి,కంట్రోలర్ కోటేశ్వరరావు,సాగర్,మరియు ప్రయాణికులు పాల్గొన్నారు.

# పర్యావరణ హిత భవిత దిశగా జెఎస్‌పి హ్యూండాయ్

## 35 ఔరా సిఎన్‌జి వాహనాల డెలివరీ

## సూర్య ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ద్వారా కార్పొరేట్ రంగానికి సిఎన్‌జి వాహనాలు




**హైదరాబాద్ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పర్యావరణ హిత భవిత దిశగా జెఎస్‌పి హ్యూండాయ్, సూర్య ట్రావెల్స్ అండ్ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తో భాగస్వామ్యాన్ని ఏర్పరచుకుంది. ఇందులో భాగంగా కార్పొరేట్ రంగానికి సిఎన్‌జి ఆధారిత హ్యూండాయ్ ఔరా వాహనాలను జూబ్లీహిల్స్‌లోని జెఎస్‌పి హ్యూండాయ్ లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో 35 హ్యూండాయ్ ఔరా సిఎన్‌జి వాహనాల పత్రాలు, తాళాలు హ్యూండాయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ దక్షిణ భారత జోనల్ బిజినెస్ హెడ్ కృపాశంకర్ మిశ్రా, సౌత్ జోనల్ కోఆర్డినేటర్ యంగ్హ్వాన్ యూన్, రీజినల్ సేల్స్ హెడ్ జి. రామ్ కుమార్లు జెఎస్‌పి హ్యూండాయ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రుధ్వీరెడ్డి సమక్షంలో సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్ మూర్తికి అందజేశారు. ఈ సందర్భంగా హ్యూండాయ్ రీజినల్ మేనేజర్ శ్రీ రామ్ మాట్లాడుతూ సిఎన్‌జి వాహనాలు ఇంధన పొదుపుతో పాటు తక్కువ కాలుష్యాన్ని కలిగించే విధంగా ఉంటాయి. భవిష్యత్తు తరాల కోసం శుభ్రమైన వాతావరణాన్ని సృష్టించడమే మా లక్ష్యం అన్నారు. జెఎస్‌పి హ్యూండాయ్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రుధ్వీరెడ్డి మాట్లాడుతూ స్థిరమైన రవాణా భవిష్యత్తుకు మార్గం. కార్పొరేట్ లాజిస్టిక్స్ రంగాలకు సిఎన్‌జి వాహనాలు అందించడం ద్వారా, తక్కువ వ్యయంతో, పర్యావరణ హిత పరిష్కారాన్ని అందిస్తున్నాం. ఇది ప్రారంభం మాత్రమే త్వరలోనే దక్షిణాదిలో సుమారు 200 వందల సిఎన్‌జి ఔరా వాహనాలను డెలివరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సూర్య ట్రావెల్స్ ఎండీ శ్రీనివాస్ మూర్తి మాట్లాడుతూ "కార్పొరేట్ రంగం స్థిరమైన రవాణా పట్ల ఆసక్తి చూపడం ఆనందకరం. సిఎన్‌జి వాహనాలు కాలుష్యం తగ్గించడంలో ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని నిర్మించడంలో సహకరిస్తాయని వివరించారు.

# డివిజన్ లో నెలకొన్న సమస్యలపై అధికారులతో పిఎసి చైర్మన్ అరికెపూడి గాంధీ సమావేశం



**కూకట్ పల్లి,ఏప్రిల్ 22(వార్తాప్రభ):**వివేకానంద నగర్ లోని పిఎసి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ కార్యాలయంలో కూకట్పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్ కాలనీ, హైదర్ నగర్, వివేకానంద నగర్, కూకట్పల్లి(పార్ట్) డివిజన్ల లో నెలకొన్న పలు సమస్యలు మరియు చేపట్టవల్సిన పలు అభివృద్ధి పనుల పై జిహెచ్ఎం ఇంజనీరింగ్ విభాగం మరియు జలమండలి అధికారులతో సమీక్షా సమావేశం జరిపిన ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జిహెచ్ఎంసి మరియు జలమండలి ప్రభుత్వ శాఖల పనితీరును సమీక్షిస్తూ అధికారులు సమన్వయంతో అభివృద్ధి చేపట్టే దిశగా మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగినది అని , అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, ప్రజా సమస్యలే పరిష్కార ధ్యేయంగా పనిచేయాలని, ప్రజలకు ఎల్లవేళలలో అందుబాటులో ఉండలని, ప్రజా సమస్యల పై అధికారులు నిర్లిప్తతను విడాలని, మీ దృష్టికి ప్రజల నుండి వచ్చిన ప్రజా సమస్యల పై స్పందించే అవసరం ఎంతైనా ఉంది అని అన్నారు.ఇంజనీరింగ్, జలమండలి, అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని, రోడ్డు కట్టింగ్ సమయంలో మంచి నీటి పైప్ లైన్ ,డ్రైనేజి పైప్ లైన్ వేసేటప్పుడు తవ్విన రోడ్ల ను వెంటనే మరమత్తులు చేయాలని, యుజిడి రోడ్లు పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని , మంచి నీటి సరఫరా వ్యవస్థ ను సరిగ్గా నిర్వహించాలని,రోడ్ల పనులలో వేగం పెంచాలని, ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతి పై సమీక్షా జరపడం జరిగినది. అసంపూర్తిగా మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, కొత్త ప్రతిపాదనలు తీసుకురావాలని పీఏసీ చైర్మన్ గాంధీ తెలియచేసారు.ఎండకాలం ను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చూడలని ,ప్రజలకు మంచి నీటి సరఫరా లో ఇబ్బందులు లేకుండా స్వచ్ఛమైన తాగునీరు ను అందించేలా చూడలని, ఎక్కడ మంచి నీటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ,సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కరించేలా చూడలని, నిరంతరం మంచి నీటి ని అందించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని పిఎసి చైర్మన్ గాంధీ అధికారులకు తెలియచేసారు.ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి జలమండలి అధికారులు డీజీఎం నాగప్రియ, మేనేజర్లు ప్రియాంక,ఝాన్సీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏఈ రాజీవ్,ఏఈ నిఖిల్,ఏఈ శ్రావణి, ఏఈ సాయి ప్రసన్న మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ లబ్ధి కోసమే ఎంపీ పై అర్ధరహితం ఆరోపణలు

## రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఆ అడ్డుకునే కుట్ర

## టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 22(వార్తా ప్రభ ప్రతినిధి):**తన రాజకీయ లబ్ధి కోసమే మాజీ ఎంపీ కేశినేని నాని విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని) పై మాజీ అర్థ రహిత ఆరోపణలు చేస్తున్నారని,రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా ఆ అడ్డుకునే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య. మంగళవారం నాడు ఇబ్రహీంపట్నంలో తన కార్యాలయంలో సీతారామయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాజకీయ సన్యాసం చేసిన కేశినేని శ్రీనివాస్ (నాని) కి మతిస్థిమితం తప్పిందని, అహంతో అక్కస్సుతో టిడిపి నుంచి బయటికి వెళ్లిపోయి ఎన్నికల్లో ఓటమి చెందిన తర్వాత ఇన్ని రోజులు అజ్ఞాతంలో ఉన్న నాని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని దాన్ని ఒక వేదికగా చేసుకుంటూ మరల టిడిపికి దగ్గర అవ్వాలని చూస్తున్నారని అన్నారు.అందులో భాగంగానే ఆకాశమంత ఎత్తు ఎదిగిన ఆయన సోదరుడు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ పై అర్థరహిత ఆరోపణలు చేశారని ఆయన చేసిన ఆరోపణలు వాస్తవ విరుద్ధమన్నారు. కేవలం రాజకీయాల్లో శివనాథ్ మచ్చ లేకుండా ఎదుగుతున్నారని, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షునిగా క్రీడలకు ఎంతో ప్రాధాన్యత వచ్చేలా పని చేసుకుంటూ ముందుకు పోతున్నారని ఓర్వలేక నాని ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేశారని దుయ్యబట్టారు.ఉర్సా క్లస్టర్స్ పూర్తిగా పారదర్శంగా ఎందుకు వెళ్తుందని, బిలియన్ డాలర్ల వ్యాపార లావాదేవీలు కలిగిన ట్రాక్ రికార్డు ఉర్సా సొంతమని తెలిపారు. వైసిపి విహాత్మకంగా అభివృద్ధిని అడ్డుకునేందుకు,రాజకీయ లబ్ధి కోసం పెట్టుబడును అడ్డుకునే విధంగా కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని తెలిపారు. గతంలో కూడా చంద్రబాబుపై లోకేష్ పై నాని చేసిన అనేక అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన చరిత్ర నానిదని, అలాంటి వ్యక్తి మరో మారు తన సొంత సోదరుడి పైనే బురదజల్లే ప్రయత్నం చేయడంలో వింత లేదని ఎదవ చేశారు.నవ్యాంధ్ర రూపశిల్పి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని, ఇప్పటికైనా నాని విజయవాడ ఎంపీ చిన్ని పై రాజకీయ కుయుక్తులు మానుకోవాలని హితవు పలికారు. లేకుంటే టిడిపి నాయకులు, కార్యకర్తలు నానికి సరైన బుద్ధి చెబుతారని జంపాల హెచ్చరించారు.

# సీసీ కెమెరాను ప్రారంభించిన. ఏలూరు ఎస్పీ మరియు కైకలూరు ఎమ్మెల్యే కామినేని.





**కైకలూరు ఏప్రిల్ 22 (వార్తా ప్రభ)** ఈరోజు ఏలూరుజిల్లా,కైకలూరు నియోజకవర్గం, కైకలూరు మండలం,కైకలూరు టౌన్ పోలీస్ స్టేషన్ నందు ఏలూరుజిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ మరియు కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ చేతులు మీదుగా కైకలూరు పట్టణంలో దాతలు వివిధ వ్యాపార యజమానుల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు.అనంతరం శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ప్రోత్సాహంతో వారి మిత్ర బృందం సొంత నిధులు రూ. 2,00,000/ తో డ్రోన్ కెమెరాను ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ ఐపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక కైకలూరు సర్కిల్ పోలీస్ అధికారులకు అందించారు.ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ వారు,కైకలూరు పట్టణ వివిధ దుకాణాల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

# పెరమనలో బాలింతలు, గర్భిణీలకు ప్రత్యేక సమావేశం

## అంగన్వాడి కేంద్రాల్లో ఉండే పోషక ఆహారంపై అవగాహన కల్పించిన సిడిపిఓ సునీలత



**సంగం, ఏప్రిల్ 22 (వార్తాప్రభ):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలం పెరమన గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సిడిపిఓ సునీలత గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆహారం గురించి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్వాడి కేంద్రంలో ఇచ్చే ఆహారంలో ఉండే పోషక విలువలపై వారికి అవగాహన కల్పించారు. బరువు తక్కువగా ఉన్న తల్లులు చిరు దాన్యాలు, బాలామృతం క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. తల్లీబిడ్డ సంక్షేమమే పోషణ పక్వాడ్ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ పద్మావతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్డీఏ కార్యాలయంలో లబ్ధిదారులకు ఎల్ ఓ సీ అందజేత



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరైన ఎల్ఓసి లెటర్ ఆఫ్ క్రెడిట్ పత్రాలను మంగళవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్ ఎస్ బేగ్ ఎన్డీఏ కూటమి నేతలతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.35 వ డివిజన్ పెజ్జోని పేటకు చెందిన ఎం సులోచన (44) హెర్నియా తో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మరింత మెరుగైన వైద్యం నిమిత్తం ఎన్డీఏ కార్యాలయంలో వైద్యం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 4 లక్షల 20, వేల ఎల్ ఓసీ బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు. త్వరితగతిన ఎల్ఓసి మంజూరు చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు సాయి సుధాకర్, పైలా సతీష్, కే శివ శర్మ, అలుగుండ్ల సుబ్బారెడ్డి, ప్రదీప్ రాజ్, బుదాల నంద కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ఇంద్రకీలాద్రి అభివృద్ధి పనులు పరిశీలించిన అధికార బృందం





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 22 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వరులు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న అభివృద్ధిపనులను మంగళవారం ఉదయం అధికార బృందం పరిశీలించింది.ఉదయం 11గంటలనుండిదేవదాయ కమిషనర్ కె. రామచంద్ర మోహన్,శ్రీ కనకదుర్గ దేవస్థానం మాస్టర్ ప్లాన్ అమలు ప్రధాన సలహాదారు, ఇంజనీరింగ్ నిపుణులు కొండలరావు, దేవదాయశాఖ చీఫ్ ఇంజనీర్ శేఖర్, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ కోటేశ్వరరావు, వైకుంఠరావు లు -నూతనంగా నిర్మిస్తున్న ప్రసాదం పోటు, అన్న ప్రసాద భవనం తదితర నిర్మాణాలు పరిశీలన చేశారు. ఇంద్రకీలాద్రి సమగ్ర అభివృద్ధికి, భక్తులకు అన్ని రకముల సదుపాయాలు కల్పించి, సులభతరంగా శ్రీ దుర్గామల్లేశ్వరుల దర్శనం కల్పించేందుకు రూపొందించిన ప్రణాళికల త్వరితగతిన అమలు పర్చేందుకు ఈ క్షేత్రస్థాయి పర్యటన జరిగింది.

# వేసవి సెలవులు వస్తున్నాయి పిల్లలు జాగ్రత్త

## గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు తెలియజేయాలి -సీఐ వేమారెడ్డి




**సంగం, ఏప్రిల్ 22 (వార్తాప్రభ):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో సీఐ వేమారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు వస్తున్న నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఈత సరదాల తో కాలువల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు సెలవుల్లో తమ పిల్లలకు ఒంటరిగా వాహనాలు ఇవ్వకుండా ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. వేసవి లో చోరీ ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాలలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తే పోలీస్ లకు సమాచారం అందించాలని తెలియచేశారు.

## అసస్తతకు గురైన వైసిపి నాయకులు వేగేశ్న రంగరాజును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్.



**కైకలూరు ఏప్రిల్ 22 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా వై స్సా ర్స వీ అధ్యక్షు లు మరి యు కై కలూరు నియో జకవర్గ మాజీ శాసన సభ్యులు దూలం నాగేశ్వరరావు,ఈ రోజు సాయంత్రం కైకలూరు మండలం, ఆటపాక లో వైయస్సార్సీపి సీనియర్ నాయకులు వేగేశ్న రంగరాజు,ఇటీవల అస్వస్థతకు గురి కాగా,వారి స్వగృహమునకు వెళ్లి వారిని పరామర్శించారు. వీరితో పాటు కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము,పంజా రామారావు,తమ్మిశెట్టి కొండ ,కన్నా రమేష్ ,సమయం రామాంజనేయులు(అంజి),కన్నా బాబు,పంజా నాగు, ఫిర్దోజ్ ఖాన్,మారగాని రంగారావు(బద్రి), వేమన నాగరాజు,వేల్పూరి నాగరాజు,తోట నాని తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# ఎం.బి.ఎ. విద్యార్థుల వీడ్కోలు సభ



**గుడివాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** స్థానిక అక్కినేని నాగేశ్వర రావు కళాశాల 2023-25 బ్యాచ్ ఎం.బి.ఎ. విద్యార్థుల వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమములో కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ కె.ఎస్. అప్పారావు ప్రసంగిస్తూ విద్యార్థిని, విద్యార్థులు కృషి, పట్టుదల, అంకిత భావంతో పనిచేయడం నేర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రెసిడెంట్ ఎల్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలను ఎన్నడూ మరువ కూడదని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్. కుమార్ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు జీవితంలో ఏర్పరచుకున్న లక్ష్యాలను క్రమ శిక్షణతో సాధించాలని పేర్కొన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి బి.ఎస్.ఎస్. పద్మజ విద్యార్థులను ప్రభావితం చేస్తూ తగు సూచనలు చేసారు. ఎం.బి.ఎ. డిపార్టుమెంటు విభాగాధిపతి శ్రీమతి డాక్టర్ ఎం.బి.సువర్చల మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను సాధించడం కోసం సాంకేతిక పరిజ్ఞానాని ఉపయోగించుకొని వ్యాపార వేత్తలుగా ఎదిగి దేశ అభివృధిలో పాలు పంచుకోవాలని పేర్కొన్నారు. తరువాత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థిని, విద్యార్థులు నృత్య ప్రదర్శనాలతో అందరిని ఆకట్టు కొన్నారు. ఈ కార్యక్రమములో ఎం.బి.ఎ. అధ్యాపకులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# పి.వై.గోల్డ్ జిమ్ కు రాష్ట్ర స్థాయి అవార్డులు

● సన్మానాలందుకున్న విజేతలు

**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** సమాజంలో యువత పాత్ర చాలా ముఖ్య భూమిక వహిస్తుందని హనుమాన్ జంక్షన్ నుండి ఇంతమంది యువకులు రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ పోటీలలో విజయం సాధించడం చాలా గొప్ప విషయం అని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు,హనుమాన్ జంక్షన్ పి వై గోల్డ్ జిమ్ యువతి యువకులు రాష్ట్ర స్థాయిలో విజయం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి హనుమాన్ జంక్షన్ జిమ్ ఆవరణలో అభినందన సభ జరిగింది. ముఖ్య అతిధిగా పాల్గొన్న చైర్మన్ చలసాని మాట్లాడుతూ ఇటువంటి క్రీడల్లో పాల్గొనడం వలన మానసికంగా శరీరకంగా ఎంతో పరిణీతి చెంది మంచి పౌరులుగా ఎదిగి దేశానికి పట్టుకొమ్మలవుతారని అన్నారు,ఈ జిమ్ లో ట్రైనింగ్ అయిన విద్యార్థులు సాధించిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరింత ముందుకు వెళ్ళాలన్నారు. జిమ్ నిర్వాహకులు బోలిశెట్టి ప్రసన్న కుమార్ ను అభినందించి సన్మానించారు, ఇంకా ఈ సభలో శ్రీ లక్ష్మి బాలాజీ కన్స్ట్రక్షన్ అధినేత కేతినీడి తేజోమూర్తి మాట్లాడుతూ ఈ జిమ్ ఇక్కడ స్థాపించినప్పుడు ఇంత పేరు తెస్తుందని అభివృద్ధిచెందుతుందని అనుకోలేదన్నారు. హనుమాన్ జంక్షన్ కే గర్వకారణంగా నిలిచిందన్నారు. ఆరోగ్యవంతమైన జీవనానికి జిమ్ అనేది చాలా ముఖ్య భూమిక వహిస్తుందని తేజోమూర్తి పేర్కొన్నారు , ఇంకా ఈ



కార్యక్రమంలో మెడివాలీ మల్టీ స్పెషలిటీ హాస్పటల్ అధినేత పంచకర్ల చక్రవర్తి, డాక్టర్ కోటే అశోక్ కుమార్, వీరమాచినేని వాణి చౌదరి , కృష్ణాజిల్లా పవర్ లిస్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మారేళ్ళ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పోటీలలో విజయం సాధించిన పి వై గోల్డ్ జిమ్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులను అతిధులు ఘనంగా సత్కరించారు. అవార్డులు సాధించిన వారిలో బోలిశెట్టి ప్రసన్న కుమార్, పరిసే మురళీ, ప్రమోద్ గిరి ,పులకంటి దొరబాబు, ఇంకొల్లు సాహితి, సూరపనేని సాయిశ్రీ తదితరులు గోల్డ్, సిల్వర్,బ్రౌన్ మెడల్స్ సాధించినందుకు అతిధులు వీరిని ఘనంగా సన్మానించారు.

# నిరుపేదల ఆపద్భాంధవుడు చంద్రబాబు.. గుడివాడ టిడిపి శ్రేణులు



**గుడివాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** మంగళవారం స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయం (ప్రజావేదిక) నందు గుడివాడ టౌన్ 11వ వార్డుకు చెందిన వాస అనుదీపిక కు 60,000 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ కి సంబందించిన ఎల్ఓసి చెక్కును అందజేశారు. అలాగే గుడివాడ రూరల్ మండలం బిళ్లపాడుకు చెందిన అశ్వద్ధతి వరసంధ్యకు 60,000 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ కి సంబందించిన ఎల్ఓసి చెక్కును అందించటం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం నిరంతరం పేదల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం కృషి చేస్తుందన్నారు. గుడివాడ నియోజకవర్గంలో వందలాదిమంది పేద మధ్యతరగతి ప్రజలకు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక చేయూతన అందించడం జరుగుతున్నది అన్నారు. ప్రభుత్వం అందజేసే సాయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చేకూరు జగన్మోహన్ రావు, ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, ఏపీ స్టేట్ ఆర్యవైశ్య కార్పొరేషన్ వైస్ చైర్మన్ గోకవరపు సునీల్, గుడివాడ పట్టణ అధ్యక్షులు దింట్యాల రాం బాబు, 11వ వార్డు నాయకులు సయ్యద్ జబీన్, షేక్ మౌలాలీ, షేక్ కరీముల్లా, పట్టపు చిన్న తదితరులు పాల్గొన్నారు.

# పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాలలో మెగా జాబ్ మేళా







**కాకినాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** కాకినాడ లోని పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాలలో మంగళవారం వికాస ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా జరిగింది.ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వి.తిరుపణ్యం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కె.పద్మశ్రీ గౌరవ అతిథిగా పాల్గొన్నారు.స్కిల్ డవలెప్మెంట్అధికారి కె. కొండలరావు, వికాస పిడి కె.లచ్చారావు, ఆస్కో ఎండీ ఎమ్. పురుషోత్తం అలుమ్ని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కె.భామిరెడ్డి,అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు నరసరాజు, -వైస్ ప్రిన్సిపాల్ డా.కె.ఆంజనేయులు, బి.చక్రవర్తి-కన్వీనర్, కె.హరీష్-హరీష్ స్పోర్ట్స్ తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్సీ పద్మశ్రీ మాట్లాడుతూ అర్హులైన అభ్యర్థులు ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. వికాస పీడీ లచ్చారావు మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో వివిధ కంపెనీలు ద్వారా సుమారు 2329ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని నిరుద్యోగులకు మంచి అవకాశమని అన్నారు. ఈ మేళాలో ఉద్యోగం పొందలేని వారిలో స్కిల్స్ పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.సుమారు మూడు వేల మంది నిరుద్యోగులు మౌఖిక పరీక్షలకు హాజరయ్యారు.

# ముగిసిన సీతారాముల కల్యాణ మహోత్సవాలు..

● కాకర్ల వీధి రామాలయంలో ఘనంగా జరిగిన 16వ రోజు కార్యక్రమాలు..



**గుడివాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** స్థానిక కాకర్ల వీధిలోని శ్రీ రామాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి. వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన 16వ రోజు కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కాకర్ల వీధి బోసు బొమ్మ సెంటర్లోని శ్రీరామలయం ప్రాంగణంలో భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ రోజు కార్యక్రమాల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నటరాజ నాట్య కళాశాల విద్యార్థులు నిర్వహించిన కూచిపూడి, జానపద, భక్తి గీతాల సాంస్కృతిక నృత్య ప్రదర్శనను అత్యద్భుతంగా చేశారు. ఈ సందర్భంగా కళాకారులకు భక్తబృందం పెద్దలు బహుమతులను అందజేశారు. పూర్తి శాస్త్రోక్తంగా భక్తుల సహకారంతో 16 రోజులపాటు స్వామి వారి కల్యాణ మహోత్సవాలను నిర్వహించినట్లు భక్త బృందం పెద్దలు తెలియచేశారు. ఉత్సవాల విజయవంతంకి సహకరించిన భక్తులకు కమిటీ పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం భక్త బృందం సభ్యులు గణపతి శివ,మానం రమేష్, తోట నాగేశ్వరరావు, గునపర్తి గిరి, దేవా రమేష్, పెదమల్లు బాబ్జి, సిరిపిల్లి రాము, సిరిగిడి సూర్యకాంతం, మెంటి గోవిందమ్మ, ఆకుల మణికంఠ, బండి మౌనిష్, నవీన్, హేమంత్, స్వర్గీయ గణపతి లక్ష్మణరావు కుటుంబ సభ్యులు, కాకర్ల విధి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సామాజిక సేవ ప్రతీ ఒక్కరి బాధ్యత..

● ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య).....

**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ 4 కార్యక్రమం మంగళవారం పెనుగంచిప్రోలు మండలం శివాపురం గ్రామంలో ఎన్ టి డబ్ల్యూ ఫౌండేషన్ ద్వారా చెరుకూరి నరేష్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, పెనుగంచిప్రోలు గ్రామం నుండి ఎన్డీఏ కూటమి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య, ఆధ్వర్యంలో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్ల వెంకటనారాయణ, వేమూరి చినబాబు,మైనార్టీ నాయకులు మహమ్మద్ ఆజాద్, ఎస్సీ నాయకులు చింతల పాండవులు దొడ్ల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ. పేదల ఇంట అభివృద్ధి పంట పీ-4 విధానం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం. పేదరికాన్ని గెలిచి ప్రజలందరికీ మెరుగైన జీవితాలు అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు.చెరుకూరి నరేష్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో పీ 4 లో భాగంగా వారి గ్రామములో మూడు కుటుంబాలను



దత్తత తీసుకొని వారి పిల్లలకు చదువుకునే ఖర్చును తానే భరిస్తానని చెప్పడం చాలా సంతోషం దాయకమన్నారు. ప్రతి ఒక్కరూ కూడా ఇదేవిధంగా చేస్తే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి కల సాకారం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన పౌష్టికాహార పక్షోత్సవాలు..



**గుడివాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** గుడివాడ అర్బన్ ఏరియా లో ఎన్టీఆర్ కాలనీ - 2 & 3 అంగన్‌వాడీ సెంటర్ నందు పౌష్టికాహార - పక్షోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా సూపర్‌వైజర్ కె. నాగ జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగ జ్యోతి మాట్లాడుతూ ప్రతి నెల 5వ తేదిన జరిగే ఈసిసిఈ డే తల్లుల మీటింగ్ లో పిల్లలకు సెల్ ఫోను ఇవ్వకుండా బహిరంగ ఆటలు ఆడించడం, వారితో తల్లిదండ్రులు కూడా పాల్గోనేలా ఉండాలి అని, హెల్దీ లంచ్ బాక్స్ చాలెంజ్ తీసుకుని పిల్లలకు పౌష్టికాహారం తో కూడిన ఆహారం అందించేలా శ్రద్ధ తీసుకోవాలి, బాడీ మాస్ ఇండెక్స్ అబ్జర్వేషన్ పై తల్లిదండ్రులకు ముందస్తు కౌన్సిలింగ్ ఇచ్చారు. కుటుంబం అంతా కలసి భోజనం చేస్తే కలిగే ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో 7వ వార్డ్ ఎంఎస్‌కె భవాని, 6వ వార్డ్ ఎంఎస్‌కే సురేఖ, టిడిపి కమిటీ సభ్యులు రాజేశ్వరరావు, ఏడుకొండలు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ కే. ఆశ్లేష, ఏ.ఎన్.ఎం మల్లేశ్వరి, ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి అంగన్వాడీలో పౌష్టికాహారం పక్షోత్సవం



**చేజర్ల,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** మండలంలోని గొల్లపల్లి అంగన్వాడీ ప్రధమ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవం కార్యక్రమాన్ని ఐసిడిఎస్ చేజర్ల సెక్టార్ సూపర్వైజర్ సిహెచ్ సురేఖ సూచనల సలహాల మేరకు అంగన్వాడి టీచర్లు మంగళవారం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది.ఈ సందర్భంగా పౌష్ఠికాహారం గూర్చి గర్భవతులకు బాలింతలకు పిల్లలకు వివరించడం జరిగినది.గర్భవతులు బాలింతలు మరియు చిన్నారులలో పౌష్టికాహార లోపాలు ఉంటే వాటిని నివారించడం గురించి వివరించడం జరిగింది.అలాగే సంరక్షణ గురించి వివరించారు. చిరుధాన్యాలతో కూడిన ఆహార పదార్థములను తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను అలాగే వ్యక్తిగత పరిశుభ్రత మరియు రక్తహీనతను నివారించు విధానాలను గూర్చి తెలియజేశారు.శిశువుల్లో ఇన్ఫెక్షన్లు నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ప్రశంసా పత్రాలు అందించిన ఎంపీపీ పీఎం వనజాక్షి రాజేష్



**విస్సన్నపేట,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో సచివాలయాల పరిధిలో సమయస్ఫూర్తితో తమ ప్రతిభ పాటవాలను ప్రదర్శించిన సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో చినరాట్నాలు ఎంపీపీ పిఎం వనజాక్షి రాజేష్ చేతుల మీదుగా బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందించడం జరిగింది. సచివాలయాలలో తమ విధులను సమయపాలన పాటిస్తూ నిర్వహించడం సర్వసాధారణమని అనుకోని పరిస్థితులలో ఒక్కొక్క సమయంలో అదే రోజు పూర్తి చేయవలసిన పనులు తప్పనిసరిగా హాజరు కావలసిన పరిస్థితి ఉండే సమయంలో శక్తి వంచన లేకుండా విధులు నిర్వహించిన వారిని గుర్తిస్తూ ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేయటం జరిగింది అన్నారు.

# శ్రీ తిరుపతమ్మ గోశాల లోని గోవులకు వరిగడ్డి వితరణ



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం గోవులకు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామానికి చెందిన రైతు మరియు శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దీక్షా గురుస్వామి రాచకొండ వెంకటనారాయణ గోవులకు 65. వరిగడ్డి కట్టలు. సుమారు (ఎనిమిది వేల రూపాయల విలువగల)వరిగడ్డి కట్టలుదానంగామంగళవారం సమర్పించినారు. వారికి దేవస్థానం డిప్యూటి కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి కిశోర్ కుమార్, మరియు చైర్మన్ జంగాల శ్రీనివాస్ శుభాభినందనలు తెలిపినారు.

# పిల్లల పెంపకంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి..



**గుడివాడ రూరల్,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పోషణ పక్వాడా కార్యక్రమంలో భాగంగా చివరిరోజైన మంగళవారం గుడివాడ మండల పరిధిలోని లింగవరం, మోటూరు, బిళ్ళపాడు గ్రామాలలో పోషణ పక్వాడా అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పై కార్యక్రమాల్లో పాల్గొన్న సూపర్‌వైజర్ ఏడి. నసీరున్నీసా మాట్లాడుతూ కమ్యూనిటీలో టెలివిజన్, మొబైల్ ఫోన్లు మొదలైన వాటితో గడిపే సమాయాన్ని తగ్గించాలనీ, సమయాన్ని బహిరంగ ఆటలు లేదా కుటుంబ ఆధారిత, శారీరక కార్యకలాపలాతో గడపడం పై కుటుంబాలకు అవగాహన కల్గించడమైనది. ఊబకాయం వున్న పిల్లలను గుర్తించడం మరియు ఈ విషయంపై తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించడమైనది. కుటుంబం మొత్తం కలిసి భోజనం చేయడం యొక్క ప్రాముఖ్యత గురించి ఆహార పదార్ధాలలో వున్న పోషకాలపై చర్చించేలా ప్రోత్సహించడం గురించి నసీరున్నీసా వివరించారు. ఈ కార్యక్రమంలో లీల, కృష్ణకుమారి, ఉమా అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ శుభాకాంక్షలు..



**గుడివాడ,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** గత 23 సంవత్సరాలుగా బొమ్మలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు శ్రీమతి జె. నాగ కన్య గారు పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ కృష్ణాడెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ గుత్తా శివరామకృష్ణ (చంటి) గారు పాల్గొన్నారు. తొలుత పూలమాలలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం గుత్తా చంటి మాట్లాడుతూ ఈ సందర్భంగా చేసిన సేవలను కొనియాడారు. క్రమ శిక్షణతో, స్నేహపూర్వకంగా మెదలి అందరి మన్ననలను పొందరనిన్నారు. పదవి విరమణ అనేది అనివార్యమని, ప్రతి ఒక్కరూ వారి భావిజీవితం సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ జగన్ మోహన్ గారు, స్కూల్ హెచ్ఎం గారు రాణి గారు విద్యా కమిటీ చైర్మన్ టిడిపి నవీన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ స్కూల్ లోని పిల్లలు ఎలిమెంటరీ స్కూల్ లోకి ప్రవేశం



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ చిల్లకల్లు సిడిపిఓ లక్ష్మీ భార్గవి, ఎసిడిపిఓ నాగమణి,ఆదేశాల మేరకు సూపర్వైజర్ ఉషారాణి, ఆధ్వర్యంలో మంగళవారం పెనుగంచిప్రోలు మండలంలోని అన్ని అంగన్వాడి సెంటర్ల లోని ఫైవ్ ప్లస్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ చేసి వారిని అంగన్వాడీ పరిధిలోని ఎలిమెంటరీ స్కూల్ లకు అంగన్వాడి కార్యకర్తలు తీసుకెళ్లి వారిని ఒకటో తరగతిలో జాయిన్ చేయడం జరిగినది, ఈ కార్యక్రమంలో ఎం సువర్చల , నాగమణి, విమలకుమారి. జయలక్ష్మి, విజయలక్ష్మి, మంజుల, కల్పన, జాన్సీ, సునీత, దామాల వాణి, భవాని, రాజాలక్ష్మి,పెనుగంచిప్రోలు మండలపరిధిలోని అన్ని పాఠశాల ల ప్రధానో పా ధ్యా యు లు,అన్ని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలి



**కంకిపాడు,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్క లబ్ధిదారుడు తప్పనిసరిగా ఈ - కేవైసీ చేయించుకోవాలని తాహ సిల్దార్ వి భావనారాయణ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో మంగళ వారం విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలన్నా, రేషన్ సక్రమంగా తీసుకోవాలన్న, రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులందరూ 5 సంవత్సరాలు కంటే తక్కువ వయసు ఉన్నవారు, మరియు 80 ఏళ్ల పైబడిన వారు మినహాయించి, కుటుంబంలోని రేషన్ కార్డు లబ్ధిదారులందరూ ఈనెల 30వ తేదీ లోపు ఈ - కేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కేవైసీ చేయించుకోవలసిన వారు రేషన్ డీలర్ల వద్ద, రేషన్ ఇచ్చే వాహనాల వద్ద, తాహసిల్దార్ కార్యాలయం, మరియు జిల్లా పౌరసరఫరాల అధికారుల వద్ద ఎక్కడ అందుబాటులో ఉంటే వారు అక్కడ ఈ - కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

# ప్రముఖ రాజకీయవేత్త రుద్ర గౌడ్ కి సోమన్న పుస్తకాలు బహుకరణ



**కర్నూలు,ఏప్రిల్ 22 (వార్తాప్రభ) :** పెద్దకడబూరు మండల పరిధిలోని కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు డా.గద్వాల సోమన్న తాను రచించిన 67, 68 పుస్తకాలు "సూక్తి చంద్రిక మరియు పూలసజ్జ" ప్రముఖ రాజకీయ వేత్త, జన నేత శ్రీ రుద్ర గౌడ్ గారికి మండల విద్యాధికారులు, హెడ్మాస్టర్ జయవంత్, ఉపాధ్యాయులు,విద్యార్థుల సమక్షంలో అందజేశారు.అదే పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు పద్మావతి గారి పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి రుద్ర గౌడ్ హాజరవ్వడం విశేషం. అనతి కాల వ్యవధిలో 70 పుస్తకాలు రచించిన కవి గద్వాల సోమన్న అవిరళ కృషిని అందరూ ప్రశంసించి,అభినందించారు.

